మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 11-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 162 Issue: 162

11 డిసెంబర్ 2025 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:39 సూర్యాస్తమయం - సా. 5:38 తిథిః సప్తమి మ. 2:02 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) తె. 3:520 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం విష్కంభ ఉ. 11:42 వరకు కరణం బవ మ. 2:02 వరకు భాలవ రా. 2:240 వరకు వర్జ్యం ఉ. 11:08 నుండి మ. 12:49 వరకు దుర్ముహూర్తం ఉ. 10:19 నుండి ఉ. 11:03 వరకు మ. 2:42 నుండి మ. 3:26 వరకు రాహుకాలం మ. 1:31 నుండి మ. 2:54 వరకు యమగండం ఉ. 6:39 నుండి ఉ. 8:02 వరకు గుళికాకాలం ఉ. 9:24 నుండి ఉ. 10:46 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:03 నుండి తె. 5:51 వరకు అమృత ఘడియలు రా. 9:12 నుండి రా. 10:53 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:31 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com




## మిస్టర్ ఇండియాగా సీఐఎస్ఎఫ్ జవాన్

జైపూర్: రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన 6వ మిస్టర్ ఇండియా 2025 ఛాంపియన్ షిప్ టైటిల్‌ను సీఐఎస్ఎఫ్ జవాను రిషిపాల్ సింగ్ (50) కైవసం చేసుకున్నారు. మిస్టర్ ఇండియా టైటిల్ తోపాటు.. 50 ప్లస్ ఏజ్, 65-70 కేజీల బాడీ బిల్డింగ్ విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని, ఈ విజయంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోపాటు.. అధికారుల తోడ్పాటు మరువలేనిది అన్నారు. రిషిపాల్ సింగ్ సాధించిన విజయం ఆర్మీ క్రమశిక్షణ, నిబద్ధతకు నిదర్శనం అని.. రిషిపాల్ విజయం సీఐఎస్ఎఫ్ కీర్తిని చాటుతుందని ఆర్మీ కొనియాడింది. 50 ఏళ్ల జవాను ఈ ఘనత సాధించడం తమకు గర్వకారణం అని పేర్కొంది.

## డబ్ల్యూడబ్ల్యూఈ స్టార్ జాన్‌సీనా గుడ్‌బై

న్యూయార్క్: డబ్ల్యూడబ్ల్యూఈ అభిమానులకు స్టార్ రెజ్లర్ జాన్ సీనా గుడ్‌బై చెప్పాడు. గత రెండు దశాబ్దాలుగా రెజ్లింగ్ ప్రపంచాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న ఈ యోధుడు రిటైర్మెంట్ ప్రకటించాడు. జాన్ సీనా ఏకంగా 17 సార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచాడు. రెజ్లింగ్ క్రీడల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చాడు. డిసెంబర్ 13న లాస్ట్ టైమ్ ఈజ్ నౌ అనే ఫేర్ వెల్ టూరులో చివరి మ్యాచ్ ఆడనున్నట్లు తెలిపాడు. దీంతో ఒక్కసారిగా జాన్‌సీనా ఫ్యాన్స్ భావోద్వేగానికి లోనవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా తమను అలరించిన జాన్ సీనా.. ఇకముందు డబ్ల్యూడబ్ల్యూఈ వేదికపై కనిపించకపోవడం బాధగా ఉందని పేర్కొంటున్నారు.






## ఒకే రోజు రూ.8,000 పెరుగుదల.. బంగారాన్ని మించి వెండి పైపైకి

సాధారణంగా బంగారం ధరలు భారీగా పెరుగుతుండటం చూస్తుంటాం. కానీ, ఈ మధ్యకాలంలో వెండి ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. తాజాగా, బుధవారం వెండి ధరలు ఏకంగా రూ.8,000 (హైదరాబాద్) పెరిగింది. దీంతో కిలో వెండి ధర రూ.2,07,000కు చేరింది. ప్రపంచ సంకేతాల మధ్య దేశీయంగా బలమైన డిమాండ్ ఉండటంతో ధరలు పైపైకి దూసుకెళ్తున్నాయి.



(ఈవార్తలు-బిజినెస్ డెస్క్)

యూఎస్ డాలర్ బలహీనపడడం.. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న బలమైన అంచనాల నేపథ్యంలో బంగారం ధరలు స్వల్పంగా పెరిగినా, వెండి ధరలు మాత్రం ఒకేసారి గుండె ధడేల్‌మనేలా పెరిగింది. ధరల పెరుగుదలపై హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సామిల్ గాంధీ మాట్లాడుతూ.. పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉండడం, భౌగోళిక రాజకీయ అనిశ్చితి వల్లే ఈ పెరుగుదల అని తెలిపారు. అటు. .24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,30,310కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,19,450కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ.1,30,460కి చేరుకోగా, 22 క్యారెట్ల తరువాయి 2 వ పేజీలో...

## అఖండ 2 టికెట్ రేట్లు పెంపు

తెలంగాణ సర్కారు గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): ఈ నెల 12న అఖండ 2 సినిమా కోసం.. టికెట్ల ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ సినిమా ప్రత్యేక షో కోసం రూ.600 టికెట్ ధరలను పెంచుకోవచ్చని గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిసెంబర్ 12 నుంచి 14 వరకు ఈ వెసులుబాటు కల్పించింది. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే ఆన్‌లైన్‌లో బుకింగ్స్ కూడా ప్రారంభమయ్యాయి. ప్రీమియర్ షో బుకింగ్స్ గురువారం ఓపెన్ కానున్నట్టు తెలుస్తోంది. ఇక, సింగిల్ స్క్రీన్‌లలో టికెట్ రూ.50 - 2 వ పేజీలో...






## నేడే పల్లెల్లో ఓట్ల సంబురం

### తొలి విడతకు ఏర్పాట్లు పూర్తి.. 890 గ్రామల్లో ఏకగ్రీవం: ఎస్ఈసీ

పల్లె పోరుకు వేళైంది. తొలి విడత పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. గురువారం ఉదయం 7 గంటల నుంచి సర్పంచ్ ఓట్లు బ్యాలెట్ బాక్సుల్లో చేరబోతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని బుధవారం మీడియాతో మాట్లాడారు. గురువారం జరిగే పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు వెల్లడించారు. పోలింగ్ సజావుగా జరిగేలా పోలీసు శాఖ భద్రత, శాంతిభద్రతల చర్యలను చేపట్టిందని అన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

హైదరాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): మొదటి దశలో 395 గ్రామాలు, రెండో దశలో 495 గ్రామాలు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయని వివరించారు. ఇప్పటివరకు అధికారులు తనిఖీల సమయంలో రూ.8.2 కోట్లు స్వాధీనం చేసుకున్నారని, మొత్తం 50,000 మంది సివిల్ పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని, భద్రతను పటిష్టం చేయడానికి బయటి నుండి 60 ప్లాటూన్లను రప్పించామని ఎస్ఈసీ తెలిపారు. 'తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పోలింగ్ ముగియనుంది. పోలింగ్ పూర్తి కాగానే కౌంటింగ్ -2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,301 |
| వెండి (గ్రాము): | రూ.207 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,829 |

### విశ్వవాణి



యాపిల్స్ తప్ప మిగతా ఏ పండ్లూ ఏడాదంతా దొరకవు. మరి యాపిల్స్ మాత్రమే అన్ని కాలాల్లో ఎందుకు దొరుకుతాయో తెలుసా? వాటిని కోసిన తర్వాత సంవత్సరం పాటు స్టోర్ చేయవచ్చట. నియంత్రిత వాతావరణం వద్ద వాటిని పాడవకుండా కాపాడుతారట. అంటే.. ఫ్రెష్‌గా ఉన్నాయని మనం కొన్నా, అవి సంవత్సరం క్రితం కూడా కోసి ఉండవచ్చని యాపిల్ రైతులు పేర్కొన్నారు.

## ప్రజల మనసు నాకు తెలుసు

### ఇంగ్లిష్ రాకున్నా రాష్ట్రాన్ని నడిపిస్తున్నా.. గుంటూరులో చదువుకోలె.. గూడుపుఠానీ తెల్వదు




ఉస్మానియా యూనివర్సిటీ/హైదరాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): ఇంగ్లిష్ మాట్లాడటం రాదని తనను కొందరు అంటున్నారని, భాష గొప్పగా రాకపోయినా ప్రజల మనసు తెలుసుకునే విద్య తనకు తెలుసు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సర్వం సిద్ధం సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గుంటూరులో చదువు కోలేదని, గూడు పుఠానీ తెలియదని అన్నారు. ఆ మాటకొస్తే అగ్ర దేశాలైన చైనా, జర్మనీ, జపాన్ వాసులకు కూడా ఇంగ్లిషు రాదని చెప్పారు. ఇంగ్లిషు మాట్లాడే అమెరికా కూడాతరువాయి 2 వ పేజీలో...

## పైసలన్నీ బడాబాబుల దగ్గరే!

### టాప్10 శాతం మంది వద్ద 65 శాతం డబ్బు

పైసలున్న బడాబాబులు మరింత పెద్దోళ్లవుతున్నారు. పైసలున్నోళ్లే ఇంకా ధనవంతులు అవుతున్నారు. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్-2026 ఇదే చెప్తోంది. ఈ నివేదిక ప్రకారం..భారత్‌లో సంపద అసమానత ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. ధనవంతులైన 10 శాతం మంది 65 శాతం వాటాను సొంతం చేసుకున్నారు. దిగువన 50 శాతం మంది కేవలం 6.4 శాతం సంపదను మాత్రమే కలిగి ఉన్నారు.



న్యూఢిల్లీ: ఆర్థికవేత్తలు లూకాస్ చాన్సెల్, రికార్డో గోమెజ్-కారెరా, రోవైడా మోష్రిఫ్, థామస్ పికెట్టీ సంపాదకీయంలో రూపొందిన ఈ నివేదిక భారతీయులలో మొదటి 1 శాతం మంది దేశ సంపదలో 40 శాతం సంపదను కలిగి ఉన్నారని వెల్లడించింది. భారత్‌లో ఆదాయం, సంపద, లింగ విభాగాల్లో అసమానత లోతుగా పాతుకుపోయింది, తరువాయి 2 వ పేజీలో...



## ఎడారి దేశంలో వరదలు

### సౌదీ అరేబియాను ముంచెత్తిన ఫ్లడ్స్

రియాద్: సౌదీ అరేబియా అనగానే మక్కా, మదీనా, ఎడారి చిత్రాలే కళ్ల ముందు కదలాడుతాయి. కానీ, ఇప్పుడు భారీ వర్షాలతో వరదలు పోటెత్తుతున్నాయి. సౌదీలోని మదీనా, జెడ్డా, మక్కా తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షానికి ఆకస్మిక తరువాయి 2 వ పేజీలో...



## పర్వదినాల్లో బ్రేక్ దర్శనాలు రద్దు

### టీటీడీ కీలక నిర్ణయం

తిరుమల, డిసెంబర్ 10 (ఈవార్తలు): తిరుమలలో డిసెంబర్‌తో పాటు జనవరిలో శ్రీవారి ఆలయంలో పలు పర్వదినాల సందర్భంగా కీలక నిర్ణయం తీసుకున్నది. వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. డిసెంబర్ 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం తరువాయి 2 వ పేజీలో...




3

### భారత్‌లో గూగుల్ ఏఐ ప్లస్

నెలకు రూ.399 చార్జీ



3

### 'దీపావళి'కి యునెస్కో గౌరవం



## రాశి ఫలాలు

11.12.2025

మేషం: ప్రముఖులతో పరిచయాలు భవిష్యత్ కు ఉపయోగపడతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు. నూతన ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. బంధు మిత్రులతో వివాదాలు పరిష్కారమవుతాయి. వ్యాపార ఉద్యోగాలు సజావుగా సాగుతాయి.

వృషభం: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది బంధుమిత్రుల నుండి విలువైన సమాచారం అందుతుంది. కొన్ని వ్యవహారాలు ఆప్తుల సలహాలు స్వీకరించి ముందుకు సాగడం మంచిది.

మిథునం: ఆధ్యాత్మిక కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. వ్యాపారాల విస్తరణలు అవరోధాలు తొలగుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉంటుంది. కుటుంబ సభ్యులతో వివాదాలు తప్పవు.

కర్కాటకం: వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు ఫలిస్తాయి. సోదరుల సహాయంతో ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా సాగుతుంది. కీలక వ్యవహారాల్లో సొంత ఆలోచనలు కలసి వస్తాయి. చిన్ననాటి మిత్రులతో విందువినోదాలు కార్యక్రమాలకు హాజరు అవుతారు.

సింహం: ఉద్యోగ ప్రయత్నాలు కొంతవరకు అనుకూలిస్తాయి. సన్నిహితుల నుండి విమర్శలు ఎదురవుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటుంది. వివాదాలకు సంభందించి దూరపు బంధువుల నుండి అందిన సమాచారం కొంత ఊరట కలిగిస్తుంది.

కన్య: దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఆశించిన మార్పులు చోటు చేసుకుంటాయి. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. బంధుమిత్రులతో వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

తుల: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మీ మాటతో కుటుంబ సభ్యులు విభేదిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు కొంత బాధిస్తాయి. అవసరానికి చేతిలో ధనం నిల్వ ఉండదు. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహ పరుస్తాయి.

వృశ్చికం: కుటుంబ వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. చేపట్టిన పనులు సమయానికి పూర్తి చేస్తారు. సోదరులతో ఆస్తి వివాదాల పరిష్కారమౌతాయి. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ధనస్సు: మిత్రుల నుంచి ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. చేపట్టిన పనుల్లో కొంత జాప్యం తప్పదు వ్యాపారమున తొందరపాటు నిర్ణయాలు తీసుకొని నష్టాలు ఎదుర్కొంటారు. ఉద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. ఆరోగ్య విషయాలలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. కుటుంబసభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి.

మకరం: సన్నిహితుల నుంచి అవసరానికి ధనసహాయం అందుతుంది. నూతన కార్యక్రమాలు చేపడతారు. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఉద్యోగ వాతావరణం సంతృప్తికరంగా ఉంటాయి. విందు వినోదాది కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగ్గా ఉంటుంది.

కుంభం: ఉద్యోగమన ఉన్నత అధికారులతో చర్చలు కలుస్తాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరుత్సాహం కలిగిస్తుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. భూ క్రయవిక్రయాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. కుటుంబ పెద్దల ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం.

మీనం: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ధన పరమైన సమస్యలు కొంత చికాకు పరుస్తాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నాయి. ఆరోగ్యం అంతగా సహకరించదు. ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు.


# ప్రజల మనసు నాకు తెలుసు

మొదటి పేజీ తరువాయి

చైనాపై ఆధారపడిందని, ఒక గంటసేపు చైనా సప్లైలు ఆపితే అమెరికా అల్లాడిపోతుందని అన్నారు. చైనాకు అమెరికా చాలా అప్పుపడిందని, కానీ, అక్కడ ఇంగ్లిషు మాట్లాడరని గుర్తు చేశారు. వర్సిటీలో చాలామంది విద్యార్థులు ఇంగ్లిషు రాదని బాధపడుతుంటారని, ఇంగ్లిష్ రాకపోవడం పెద్ద విషయం కాదని చెప్పారు. తాను రెండేళ్లుగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నానని, కావాలంటే ఇంగ్లిషులో మాట్లాడేవాళ్లని 10 మందిని పెట్టుకొని మాట్లాడమని చెబుతానని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి రావాలని, ఆర్ట్స్ కాలేజీ ముందు నిలబడి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలని అనుకున్నానని చెప్పారు. 4 కోట్ల ప్రజల ఆకాంక్ష నెరవేర్చింది ఉస్మానియా యూనివర్సిటీ అని అన్నారు. ప్రత్యేక ఉద్యమ సమయంలో ఓయూ రాష్ట్ర ఆకాంక్షను బలంగా వినిపించిందని గుర్తుచేశారు. యూనివర్సిటీకి వచ్చేందుకు కావాల్సింది ధైర్యం కాదని, వర్సిటీపై అభిమానం అని చెప్పారు. అధికారులు తనకు పేపర్లు ఇచ్చి అదే మాట్లాడాలని చెప్పారని, కానీ, తన మనసులో ఏముంటే అది మాట్లాడతానని, పేపర్ చూసి మాట్లాడనని చెప్పానని తెలిపారు. ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చి దిద్దాలన్నదే తన సంకల్పం అని చెప్పారు.

### ఓయూకు రూ.1000 కోట్లు

ఓయూ అభివృద్ధి కోసం రూ.1000 కోట్ల మేర నిధులు విడుదల చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఆ వెంటనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మొత్తాన్ని విద్యార్థులకే అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయ పూర్వ




విద్యార్థులు వర్సిటీ అభివృద్ధి కోసం రూ.45 లక్షల చెక్కును అందజేశారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చించడానికే తాను ఇక్కడికి వచ్చానని తెలిపారు. గతంలో కొందరు ముఖ్యమంత్రులను ఓయూ స్టూడెంట్స్ అడ్డుకున్నారని అన్నారు. ఎందుకు ధైర్యం చేసి ఓయూకు వెళ్తున్నావని తనను కొందరు ప్రశ్నించారని అన్నారు. తాను ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చింది ధైర్యంతో కాదని, విద్యార్థుల గుండెల్లో తన మీద ఉన్న అభిమానంతో వచ్చానని అన్నారు. దేశంలోని పురాతన విశ్వవిద్యాలయాల్లో ఉస్మానియా ఒకటి అన్నారు. ఈ వర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు.

### ప్రొఫెసర్ కాశీం భజన

సర్వం సిద్ధం సభలో ప్రొఫెసర్ కాశీం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు, విద్యార్థి నాయకులతో పాటు ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కాశీం.. 'సీఎం రేవంత్ రెడ్డి 25 ఏళ్ల క్రితం గీతమ్మను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కానీ ఇటీవల మరో అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. విద్య అనే పేరు కలిగిన అమ్మాయిని రేవంత్ రెడ్డి ప్రేమిస్తున్నారు. అందుకే ఆయన ప్రతి ప్రసంగంలో విద్య గురించి మాట్లాడుతున్నారు. విద్యపై ప్రేమను రేవంత్ రెడ్డి.. తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు కొనసాగించాలి' అని వ్యాఖ్యానించారు. ఆయన మాట్లాడుతుంటే సీఎం రేవంత్ రెడ్డి సైతం 'భజన' చేస్తున్నారన్నట్లుగా ముఖంలో భావోద్వేగాలు పలికించారు. కాశీం వ్యాఖ్యలపై కొన్ని వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. చదువును సరస్వతి తల్లిగా కొలుస్తారని.. అలాంటిది విద్యను ఒక అమ్మాయి అనడం.. ఆమెతో సీఎం రేవంత్ రెడ్డి ప్రేమలో పడ్డాడు అనడం ప్రొఫెసర్ కాశీం భావ దారిద్ర్యాని నిదర్శనమని ఘాటుగా విమర్శిస్తున్నారు.

# భారత్‌లో గూగుల్ ఏఐ ప్లస్

### నెలకు రూ.399 చార్జీ

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజ సంస్థ గూగుల్, ఏఐ ప్లస్ పేరిట భారత్‌లో కొత్త ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. గూగుల్ ఏఐకు సంబంధించిన అడ్వాన్స్‌డ్ ఫీచర్లతో ఈ సరికొత్త సబ్‌స్క్రిప్షన్‌ను ప్రవేశపెట్టారు. రూ. 2వేల సబ్‌స్క్రిప్షన్‌తో గూగుల్ ప్రో ప్లాన్‌ను తీసుకువచ్చిన గూగుల్, తాజాగా తక్కువ ధరలో గూగుల్ ప్లస్ సబ్‌స్క్రిప్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. గూగుల్ ఏఐ ప్లస్ నెలవారీ సబ్‌స్క్రిప్షన్ కోసం యూజర్లు నెలకు రూ.399 చెల్లించాల్సి ఉంటుంది. దీంతో గూగుల్ ఏఐ ప్లస్ ఫీచర్లను పొందవచ్చు. అయితే గూగుల్ ఏఐ టూల్స్‌కు మొదటిసారిగా సబ్‌స్క్రిప్షన్ తీసుకునే వారికి మాత్రం ఈ ప్లాన్‌ను నెలకు రూ.199 కే మొదటి 6 నెలల పాటు అందిస్తున్నారు.



కనుక యూజర్లు ఇప్పటి వరకు గూగుల్ ఏఐ టూల్స్ కు సబ్‌స్క్రిప్షన్ ను తీసుకోకపోతే ఈ ఆఫర్ కింద నెలకు కేవలం రూ.199కే మొదటి 6 నెలల పాటు గూగుల్ ఏఐ ప్లస్ ప్లాన్‌ను ఉపయోగించుకోవచ్చు. గూగుల్ ఏఐ ప్లస్ ప్లాన్ ద్వారా జెమిని యాప్‌లో జెమిని 3 ప్రో మోడల్‌న యాక్సెస్ చేయవచ్చు. గూగుల్ ఇమేజ్ జనరేషన్, ఎడిటింగ్ మోడల్, నానా బనానా ప్రో యాక్సెస్ ను ఉపయోగించుకోవచ్చు. అంతే కాదు వీడియో జనరేషన్‌తో పాటు ఫ్లో వంటి క్రియేటివ్ టూల్స్‌ను ఉపయోగించుకోవచ్చు. అలాగే ఇమేజ్ ఎడిటింగ్ లేదా క్రియేషన్ కోసం అధునాతన నానో బనానా ప్రొ సేవలను వాడుకోవచ్చు. పనిచేసే ఉద్యోగులు తమ గూగుల్ అకౌంటలోని జీమెయిల్, డాక్స్ వంటి గూగుల్ యాప్‌లలో ఏఐ టూల్స్‌ను ఇంటిగ్రేట్ చేసి ఉపయోగించవచ్చు. డీప్ రీసెర్చ్ కోసం నోట్‌బుక్ ఎల్ఎం టూల్‌ను సైతం ఈ ప్లాన్‌లో భాగంగా లభిస్తుంది. గూగుల్ ఏఐ ప్లస్ ప్లాన్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న యూజర్లకు 200 జీబీ క్లౌడ్ స్టోరేజ్ స్పేస్ ఉచితంగా లభిస్తుంది.

# సిల్వర్ సునామీ

మొదటి పేజీ తరువాయి

గోల్డ్ ధర 10 గ్రాములకు రూ.1,19,600కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,310కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.1,19,450కి చేరింది.

### పెరుగుదలకు కారణాలు:

స్థిరంగా తక్కువ సరఫరా
తగ్గుతున్న ఇన్వెంటరీ (నిల్వలు)
ఇటీవల యుఎస్ క్రిటికల్ మినరల్స్ జాబితాలో వెండిని చేర్చడం

గత పది రోజుల్లో వెండి ధరలు ఇలా.. (హైదరాబాద్)

| తేది | వెండి ధర (కిలో) |
|---|---|
| డిసెంబర్ 10 | రూ.2,07,000 |
| డిసెంబర్ 9 | రూ.1,99,000 |
| డిసెంబర్ 8 | రూ.1,98,000 |
| డిసెంబర్ 7 | రూ.1,95,900 |
| డిసెంబర్ 6 | రూ.1,95,900 |
| డిసెంబర్ 5 | రూ.1,96,000 |
| డిసెంబర్ 4 | రూ.2,00,000 |
| డిసెంబర్ 3 | రూ.2,01,000 |
| డిసెంబర్ 2 | రూ.1,96,000 |
| డిసెంబర్ 1 | రూ.1,96,000 |






## 'దీపావళి'కి యునెస్కో గౌరవం

న్యూఢిల్లీ: దీపాల పండుగ 'దీపావళికి' అరుదైన గౌరవం లభించింది. దీపావళి పండుగను యునెస్కో అవ్యక్త సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేరుస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఘనా, జార్జియా, కాంగో, ఇథియోపియా, ఈజిప్ట్ వంటి దేశాలలో సాంస్కృతికంగా జరుపుకునే వాటిలో ఈ పండుగకు చోటు కల్పించింది. ఈ మేరకు ఢిల్లీలోని ఎర్రకోటలో భారతదేశం నిర్వహిస్తున్న అవ్యక్త సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ కోసం అంతర్-ప్రభుత్వ కమిటీ కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రకటనపై కేంద్ర సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హర్షం వ్యక్తం చేశారు. 'నిజానికి ఈ నిర్ణయం భారతీయులకు ఎంతో లోతైన భావోద్వేగ విలువలతో ముడిపడి ఉన్న సంప్రదాయానికి దక్కిన అపురూపమైన గౌరవం. ఈ దీపావళి పండుగని తరతరాలుగా జరుపుకుంటున్నారు, జీవన వారసత్వానికి శక్తివంతమైన చిహ్నంగా కొనసాగుతోంద'ని అన్నారు.




## నేడే పల్లెల్లో ఓట్ల సంబురం

మొదటి పేజీ తరువాయి

జరుగుతుంది. ఆ వెంటనే వార్డు మెంబర్లు ఉప సర్పంచిని ఎన్నుకునే ప్రక్రియ కూడా ఉంటుంది. గురువారం 3,834 గ్రామాలు, 27,628 వార్డుల్లో పోలింగ్ జరగబోతోంది. పోలింగ్ జరిగే మండలాల్లో సెలవు ఉంది. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశాం. ఈ ఎన్నికల్లో విధుల్లో లక్ష మందికిపైగా సిబ్బంది పాల్గొంటారు' అని పేర్కొన్నారు.

## అఖండ 2 టికెట్ రేట్లు పెంపు

మొదటి పేజీ తరువాయి

పెంపునకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మల్టీప్లెక్స్‌లలో టికెట్ రూ.100 చొప్పున పెంచుకోవచ్చని పేర్కొంది. మూడు రోజుల పాటు పెంచిన ధరలు కొనసాగింపు ఉంటుందని తెలిపింది. అయితే.. పెరిగిన ఆదాయంలో 20 శాతం కార్మికుల సంక్షేమానికి ఇవ్వాలని ఆదేశించింది. ఈ సొమ్మును టాలీవుడ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఖాతాకు తప్పనిసరిగా చెల్లించాలని ఆదేశాల్లో పేర్కొంది.

## పర్వదినాల్లో బ్రేక్ దర్శనాలు రద్దు

మొదటి పేజీ తరువాయి

జరగనున్నది. డిసెంబర్ 29న, ఇక వైకుంఠ ఏకాదశి డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతాయని తెలిపింది. జనవరి 25న రథ సప్తమి కారణంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే వీఐపీ దర్శనాలు ఉంటాయని.. ఆయా రోజుల్లో సిపారసు లేఖలపై వచ్చే వారికి బ్రేక్ దర్శనాలు ఉండవని.. దర్శనాలకు సంబంధించిన సిఫారసు లేఖలు స్వీకరించలేమని తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులను కోరింది.

## పైసలన్నీ బడాబాబుల దగ్గరే!

మొదటి పేజీ తరువాయి

ఇది ఆర్థికవ్యవస్థలో నిరంతర నిర్మాణాత్మక విభజనలకు కారణమవుతోందని నివేదిక అభిప్రాయపడింది. భారత్‌లో సగటు తలసరి వార్షిక ఆదాయం దాదాపు రూ. 6.49 లక్షలు, సగటు సంపద దాదాపు 29.32 లక్షలు ఉంది. అయితే మహిళా కార్మిక భాగస్వామ్యం 15.7 శాతంతో తక్కువగా ఉంది, ఇది గత దశాబ్ద కాలంలో ఎలాంటి మార్పు లేదని తెలిపింది. చారిత్రక దృక్పథాన్ని తీసుకుంటే, 1980లో జాతీయ ఆదాయ వాటాలో 40 శాతం ఎక్కువ జనాభా వద్ద ఉందని, కానీ నేడు దాదాపు అందరూ దిగువన ఉన్న 50 శాతంలో ఉన్నారని నివేదిక వెల్లడించింది.

# ఎడారి దేశంలో వరదలు

మొదటి పేజీ తరువాయి

వరదలు సంభవించాయి. దీంతో జనజీవనం స్తంభించింది. జెడ్డాలో కురిసిన కుంభవృష్టికి నగరం మొత్తం అతలాకుతలమైంది. కుండపోత వర్షాల తర్వాత నగరాన్ని వరదలు ముంచెత్తాయి. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజా రవాణా నిలిచిపోయింది. దీంతో అధికారులు నగరంలో రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు సౌదీ మీడియా నివేదించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావొద్దని.. ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. వరద ప్రభావం తగ్గుముఖం పట్టేవరకూ అనవసరమైన ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని హెచ్చరించారు. కాగా, రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరదలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సౌదీ అరేబియాలోని మక్కా, మదీనా ముస్లింలకు పవిత్రమైన ప్రార్థనా స్థలాలు. ప్రతి సంవత్సరం హజ్, ఉమ్రా యాత్ర కోసం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ముస్లింలు ఆయా నగరాలకు చేరుకుంటారు. ప్రస్తుతం అక్కడ భారీ వర్షాల నేపథ్యంలో వివిధ దేశాల నుంచి వచ్చిన యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



# నటి ప్రగతికి వెల్లువెత్తిన శుభాకాంక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): టాలీవుడ్ నటి ప్రగతి ఇటీవల టర్కీలో జరిగిన ఏషియన్ ఓపెన్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సహా 4 మెడల్స్ గెలుచుకుని సత్తా చాటారు. ఈ నేపథ్యంలో, ప్రగతిపై అన్ని వైపుల నుంచి అభినందనల వర్షం కురుస్తోంది. తాజాగా, ప్రగతి విజయగాథపై జనసేన పార్టీ వీరమహిళ విభాగం కూడా స్పందించింది. కళల నుంచి అంతర్జాతీయ క్రీడల వరకు బహుముఖ రంగాల్లో రాణిస్తున్న ప్రగతి వంటి మహిళలు ఎందరికో ఆదర్శమని, స్ఫూర్తిదాయకమని జనసేన పార్టీ వీరమహిళ విభాగం కొనియాడింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "ప్రగతి లాంటి మహిళలు శక్తి, పట్టుదల, స్ఫూర్తికి సజీవ నిదర్శనాలు. వారు అడ్డంకులను అధిగమిస్తూ, గొప్ప విజయాలు సాధిస్తూ ఎందరికో మార్గదర్శకంగా నిలుస్తున్నారు" అని ఆ ప్రకటనలో పేర్కొంది. వారి అంకితభావం, ధైర్యం అసంఖ్యాకమైన ఇతరులను తమ కలలను సాకారం చేసుకునేలా ప్రోత్సహిస్తాయని తెలిపింది. అభిరుచి, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని ప్రగతి నిరూపిస్తున్నారని ప్రశంసించింది. ప్రగతి వంటి మహిళలను గౌరవించడం కేవలం వ్యక్తిగత విజయాలను గుర్తించడం మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి అంశంలో మహిళలు ప్రదర్శించే శక్తి, సామర్థ్యం, నాయకత్వ పటిమను గుర్తించడమేనని వీరమహిళ విభాగం స్పష్టం చేసింది.

## జాబ్ క్యాలెండర్‌ను విస్మరించారు

**సీఎం రేవంత్‌పై ఎమ్మెల్సీ కవిత ఫైర్**



హైదరాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ముఖ్యంగా ఉద్యోగాల భర్తీ విషయంలో యువతను మోసం చేసిందని ఆమె ఆరోపించారు. "జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులకు ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ హామీని పూర్తిగా విస్మరించారు. మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాట ఏమైంది?" అని కవిత నిలదీశారు. ఇప్పటివరకు ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారో, ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న 'రైజింగ్ తెలంగాణ' కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. "పోరాటాల పురిటిగడ్డ అయిన ఓయూలో అడుగుపెడుతున్న మీరు, మీ వంచనతో ఆందోళనలో ఉన్న నిరుద్యోగ బిడ్డలకు ఏం సమాధానం చెబుతారు?" అని ఆమె ప్రశ్నించారు. "ఉత్తుత్తి మాటలు, జాబ్‌లెస్ క్యాలెండర్లకు కాలం చెల్లింది. రైజింగ్ పేరుతో అబద్ధాలు చెప్పడం కాదు, యువత ఆకాంక్షలపై ఓయూ గడ్డ మీదనే స్పష్టత ఇవ్వాలి" అని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు యువత పక్షాన పోరాడుతామని ఆమె స్పష్టం చేశారు.

## ఆదిలాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

ఆదిలాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): ఆదిలాబాద్ జిల్లాలో ఈ రోజు తెల్లవారుజామున ఒక ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జైనథ్ మండలం, తరోడ గ్రామ సమీపంలో వేగంగా వెళ్తున్న ఒక కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతులను ఆదిలాబాద్ పట్టణంలోని జైజవాన్ నగర్, లక్ష్మీనగర్ వాసులుగా గుర్తించారు. వీరంతా ఉపాధి నిమిత్తం మహారాష్ట్రకు మేస్త్రీ పనుల కోసం వెళ్లి, పని ముగించుకుని కారులో తిరిగి స్వస్థలానికి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇండిగోపై డీజీసీఏ నిఘా

## పర్యవేక్షణకు 8 మందితో బృందం

న్యూఢిల్లీ: విమాన సర్వీసుల్లో తీవ్ర అంతరాయాలతో ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) దృష్టి సారించింది. సంస్థ కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షించేందుకు 8 మంది సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని బుధవారం ఏర్పాటు చేసింది. ఈ బృందంలోని ఇద్దరు అధికారులు ఇండిగో కార్పొరేట్ ప్రధాన కార్యాలయంలోనే ఉంటూ రోజువారీ ప్రక్రియలను పరిశీలించి, లోపాలను గుర్తిస్తారని డీజీసీఏ తెలిపింది. కొత్త విమాన డ్యూటీ నిబంధనల కారణంగా తీవ్రమైన పైలట్ల కొరత ఏర్పడటంతో ఇండిగో గత కొద్ది రోజులుగా వేలాది విమానాలను రద్దు చేయడం, ఆలస్యంగా నడపడం తెలిసిందే. దీంతో దేశవ్యాప్తంగా ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళం నెలకొంది. ఈ సంక్షోభం నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన శాఖ ఇప్పటికే ఇండిగో నడపగల విమానాల సంఖ్యపై 10 శాతం కోత విధించింది. ఈ పరిణామాలను అసాధారణ పరిస్థితులుగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అభివర్ణించారు. డిసెంబర్ 3 నుంచే పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి సీనియర్ అధికారులను కీలక విమానాశ్రయాలకు పంపినట్లు ఆయన 'ఎక్స్'లో తెలిపారు. మరోవైపు, ఇండిగో కార్యకలాపాలు డిసెంబర్ 9 నాటికే పూర్తిగా కుదుటపడ్డాయని సీఈఓ పీటర్ ఎల్బర్స్ నిన్న ప్రకటించారు. సంస్థ తిరిగి గాడిన పడిందని, ప్రస్తుతం 138 గమ్యస్థానాలకు రోజుకు 1,800కు పైగా విమానాలను నడుపుతున్నామని చెప్పారు. ఈ సమస్యకు దారితీసిన కారణాలపై అంతర్గత సమీక్ష ప్రారంభించామని ఆయన వెల్లడించారు.

# బావబామ్మర్దులకు కుళ్లు

**గ్లోబల్ సమ్మిట్ సక్సెస్... పెట్టుబడులు తరలివచ్చాయి.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



హైదరాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): ఇందిరమ్మ రాజ్యంలో, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్లోబల్ సమ్మిట్‌ను భారీ పెట్టుబడుల లక్ష్యంతో విజయవంతంగా నిర్వహించామని, ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రముఖ పెట్టుబడిదారులు తెలంగాణపై చూపిన నమ్మకం రాష్ట్ర ప్రతిష్టను పెంచాయని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, మంత్రులు, ప్రభుత్వ బృందం మొత్తం కలిసి సమిష్టిగా చేసిన కృషితో ఈ సమ్మిట్ ప్రపంచ దృష్టిని ఆకర్షించిందన్నారు. బుధవారం సీఎల్పీలో నిర్వహించిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి స్పష్టమైన విజన్ ఉందని, పేద ప్రజల సంక్షేమం, రైతుల భద్రత, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కానీ బీఆర్ఎస్ విజన్ దోచుకోవడం, దాచుకోవడం, పేదల భూములను ఆక్రమించడం మాత్రమే అని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా భారీగా పెట్టుబడులు రావడం బావ, బామ్మర్దిలకు జలసీని కలిగించిందని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. అందుకే హరీష్ రావు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. తమ హయాంలో పెట్టుబడుల పేరిట ఎన్ని కంపెనీలు నిజంగా తెలంగాణలో పెట్టుబడి పెట్టాయని, ఒక శ్వేతపత్రం విడుదల చేసేందుకు ధైర్యం ఉందా? అని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేసిన ప్రతి ఎంఓయూకి, ప్రతి పెట్టుబడి, ప్రతి వివరాన్ని పారదర్శకంగా పబ్లిక్ డొమైన్‌లో పెడుతున్నామని, ఇదే మా అకౌంటబిలిటీ అన్నారు. ట్రంప్ కూతురు ఇవాంకా వచ్చినప్పుడు, పేదలను బందీలుగా పెట్టడం, డ్రైనేజీలపై రెడ్ కార్పెట్ వేయడం లాంటి పనులు చేసిన గత ప్రభుత్వ నేతలకు గ్లోబల్ సమ్మిట్‌పై మాట్లాడే నైతిక హక్కు లేదని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు. తమ ఇంట్లోనైనా ముందుగా తగాదాలు తగ్గించుకోవాలని, కుర్చీ కోసం ఎప్పుడూ ఈ పోట్లాటనే ఉందని, దీన్ని తెలంగాణ ప్రజలందరూ చూస్తున్నారని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ, ధరణి, మిషన్ కాకతీయ ఇవన్నీ విజన్ పేరుతో కోట్ల రూపాయల కొల్లగొట్టిన స్కామ్‌లే అని, కోట్ల రూపాయలతో నిర్మించిన సచివాలయం వానొస్తే లీకేజీలు అవడంతోనే మీ విజన్ స్థాయి ఏమిటో అక్కడే కనిపించిందన్నారు. తమ పది సంవత్సరాల పాలనలో తీసుకున్న అప్పులతో ప్రతి నెల ఆరువేల కోట్లు కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇది బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక క్రమశిక్షణ ఎలా పాడైందో స్పష్టంగా చూపిస్తుందని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. తమ విజన్ ప్రజల కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం. హరీష్ రావు నోటికొచ్చినట్టుగా మాట్లాడే మాటలను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఇక సహించమని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏదని, ఏ పథకం కోసం ఎంత ఖర్చు చేశారో హరీష్ రావు స్పష్టంగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భారీ పెట్టుబడులు రాష్ట్రానికి రావడం చూసి, అభివృద్ధి పట్ల అసూయతో హరీష్ రావు ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని, మీ విజన్ అంతా కమిషన్లే, కాంట్రాక్టులే అని, ప్రజా సేవకు సంబంధించి ఒక్కటీ లేదని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శలు గుప్పించారు.

# కాంగ్రెస్ స్వలాభానికే జీహెచ్ఎంసీ విస్తరణ

**బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్‌రావు ఆరోపణ**



హైదరాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): జీహెచ్ఎంసీ విస్తరణ నిర్ణయాన్ని ఇప్పటికీ బీజేపీ వ్యతిరేకిస్తున్నదని.. దీని వెనుక ఉన్నది ప్రజాప్రయోజనం కాదని.. రాజకీయ స్వలాభం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. బుధవారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మజ్లిస్ పార్టీకి ప్రత్యేక ప్రయోజనం కల్పించడం కోసమేనని ఈ విస్తరణ అని తెలుస్తున్నదని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ శివార్లలోని 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు, కీలక గ్రామ పంచాయతీలను జోడించి జీహెచ్ఎంసీని విస్తరించేందుకు నిర్ణయం తీసుకున్నదని.. ఈ విస్తరణతో జీహెచ్ఎంసీ విస్తీర్ణం దాదాపు 2,000 చదరపు కిలోమీటర్లకు పెరిగి, మొత్తం 300 వార్డులుగా పునర్విభజన జరుగుతుందని చెప్పారు. 69 లక్షల ఓటర్లు ఉన్న జీహెచ్ఎంసీని అకస్మాత్తుగా కోటి 69 లక్షల జనాభా స్థాయికి తీసుకువచ్చి, హైదరాబాద్‌ను దేశంలోనే అతిపెద్ద నగరంగా మార్చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటిస్తున్నదని.. కానీ నిజానికి ఇప్పటికే జీహెచ్ఎంసీలోని అనేక వార్డుల్లో రోడ్లు సరిగా లేవని, సీవరేజ్ సిస్టమ్ లేదని, మౌలిక వసతులు సరిగ్గాలేవని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకముందే, విస్తరణ పేరిట మరిన్ని ప్రాంతాలను చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. విస్తరణతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలపై పన్నులు పెరుగుతాయన్నారు. అంతేకాకుండా సామాన్య రైతుల భూములు ఇండస్ట్రియల్ ల్యాండ్‌గా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా, ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహించకుండా, పబ్లిక్ డొమైన్‌లో వివరాలు షేర్ చేయకుండా ప్రభుత్వం ఈ విస్తరణ నిర్ణయం తీసుకోవడం పూర్తిగా తప్పుడు పద్ధతని అన్నారు. కొత్తగా ప్రతిపాదించిన 300 వార్డుల విభజనలో స్పష్టంగా రాజకీయ ప్రయోజనం దాగి ఉందని.. విస్తరణను మూడు భాగాలుగా చేస్తూ.. ప్రత్యేకంగా మజ్లిస్ పార్టీకి మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు వచ్చేలా లైనప్ చేస్తూ.. రాజకీయ ప్రయోజనం కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తున్నదని ఆరోపించారు. ఈ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరూ వారం రోజుల్లో తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. బీఆర్ఎస్ దారిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని చెప్పారు.



# స్టార్టప్‌లకు రూ.1000 కోట్లు

**సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**

**టీ-హబ్‌లో 'గూగుల్ ఫర్ స్టార్టప్' ప్రారంభం**

గచ్చిబౌలి/హైదరాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణలోని స్టార్టప్‌లకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రోత్సాహాన్ని ప్రకటించింది. స్టార్టప్‌ల అభివృద్ధి కోసం రూ.1,000 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ నిధిని సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తులో గూగుల్ వంటి పెద్ద సంస్థలుగా ఎదగాలని ఆయన స్టార్టప్‌లకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో ఏర్పాటు చేసిన 'గూగుల్ ఫర్ స్టార్టప్' హబ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో స్టార్టప్‌ల వృద్ధికి అనువైన వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "1998లో ఇద్దరు స్నేహితులు కాలిఫోర్నియాలోని ఓ గ్యారేజ్‌లో ప్రారంభించిన స్టార్టప్, ఈరోజు ప్రపంచ దిగ్గజం గూగుల్‌గా నిలిచింది. అదే స్ఫూర్తితో మన స్టార్టప్‌లు కూడా ఎదగాలి" అని ఆయన అన్నారు. ప్రొడక్ట్ ఆధారిత, వినూత్నమైన స్టార్టప్‌లపై యువత దృష్టి సారించాలని సీఎం సూచించారు. గూగుల్, యాపిల్, అమెజాన్ వంటి సంస్థలు 20 ఏళ్ల క్రితం చిన్న స్టార్టప్‌లుగా మొదలై ఇప్పుడు బిలియన్ డాలర్ల కంపెనీలుగా మారాయని గుర్తుచేశారు. "హైదరాబాద్ కేవలం స్టార్టప్ హబ్‌గా మిగిలిపోకూడదు. ఇక్కడి నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంలో స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఈ హబ్ ఏర్పాటుతో రాష్ట్రంలో ఆవిష్కరణల వాతావరణం మరింత బలపడుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ సంయుక్తంగా ఏఐ ఆధారిత స్టార్టప్‌లకు ప్రోత్సాహం, ప్రతిభను వెలికితీయడం, అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయడం వంటి అంశాలపై పనిచేయనున్నాయి.



# గ్లోబల్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్: హరీశ్ రావు

హైదరాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ అయిందని, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వం విడుదల చేసిన విజన్ డాక్యుమెంట్‌లో ఎలాంటి విజన్ గానీ, దాన్ని చేరుకునే మిషన్ గానీ లేవని, అది 'విజన్‌లెస్' డాక్యుమెంట్ అని ఎద్దేవా చేశారు. "క్యూర్, ప్యూర్, రేర్ అంటున్న రేవంత్ రెడ్డి.. తెలంగాణను కొల్లగొడుతున్న చోర్" అంటూ హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గ్లోబల్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల (ఎంఓయూ) వెనుక చీకటి ఒప్పందాలు జరిగాయని ఆయన ఆరోపించారు. అంకెల గారడీ తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు ఏవీ జరగడం లేదని విమర్శించారు. గడిచిన రెండేళ్లలో సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు, సమ్మిట్‌ల ద్వారా రాష్ట్రానికి ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? వాటిలో ఎన్ని కంపెనీలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాయి? ఎంతమంది యువతకు ఉద్యోగాలు లభించాయి? అనే వివరాలతో దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని ఇదే గ్లోబల్ సమ్మిట్ వేదికగా బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ప్రశంసించారని హరీశ్ రావు గుర్తుచేశారు. వారి ప్రశంసలే ప్రస్తుత ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివని ఆయన వ్యాఖ్యానించారు.

## పలువురు ఐఎఫ్ఎస్‌ల బదిలీ

హైదరాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): రాష్ట్రంలో పలువురు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్వర్వులు జారీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా డీఎఫ్‌వో పద్మజారాణిని సిద్దిపేట డీఎఫ్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. నాగర్ కర్నూల్ డీఎఫ్‌వోగా పని చేస్తున్న రోహిత్ గోపిడిని రంగారెడ్డి జిల్లా బాధ్యతలు అప్పగించింది. ఊట్నూర్ ఎఫ్‌డీవో రేవంత్ చంద్రను నాగర్ కర్నూల్ డీఎఫ్‌వోగా, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్ బొబడేను నిర్మల్ డీఎఫ్‌గా నియమించింది. నారాయణపేట ఎఫ్‌డీవో కేవీఎస్ ప్రసాద్‌రెడ్డిని సంగారెడ్డి డీఎఫ్‌వోగా బదిలీ చేసింది. డీ సుధాకర్‌రెడ్డిని యాదాద్రి భువనగిరి డీఎఫ్‌వోగా, ఏసీఎఫ్ సీ శ్రీధర్‌రెడ్డిని ఎఫ్‌సీఆర్ఐ ములుగు జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# ఇండిగోకు 1,800 కోట్ల నష్టం

**సంస్థపై విమానాల రద్దు ప్రభావం**

న్యూఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థ ఇండిగో ఇటీవల రోజుకు వందల విమానాలను రద్దు చేస్తున్న సంగతి తెలిసిందే. దీని ఫలితంగా కంపెనీ మూడో త్రైమాసికానికి సంబంధించి బ్యాలెన్స్ షీట్‌లో భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కోనుంది. ఇప్పటికే విమానాల రద్దు వల్ల ఇండిగోకు రూ.1,800 కోట్ల నష్టం వాటిల్లింది. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. డిసెంబర్ 9 వరకు టిక్కెట్ల రద్దు కారణంగా ఎయిర్‌లైన్‌కు ఇప్పటికే వచ్చిన తక్షణ నష్టం రూ.900 కోట్లకు పైగా ఉంది. ఇది టిక్కెట్ల రద్దు కారణంగా ప్రయాణికులకు తిరిగి చెల్లించింది. అయితే, విమానాల ఆలస్యం కారణంగా రద్దు చేయాల్సిన టిక్కెట్లకు పరిహారం చెల్లించాల్సి వస్తే ఈ ఆర్థిక భారం మరింత పెరుగుతుంది. ఎయిర్‌లైన్ తాజా వివరాల ప్రకారం, డిసెంబర్ 1–9 తేదీల మధ్య కాలానికి కంపెనీ 8.86 లక్షల పీఎన్ఆర్‌లను రద్దు చేసింది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రయాణీకుల చార్టర్ ప్రకారం, 2 గంటల కంటే ఎక్కువసేపు ప్రయాణించే విమానాన్ని రద్దు చేసి, 24 గంటల ముందు ప్రయాణీకుడికి సమాచారం ఇవ్వకపోతే ఎయిర్‌లైన్ రూ. 10,000 లేదా ప్రాథమిక ఛార్జీతో పాటు ఎయిర్‌లైన్ ఇంధన ఛార్జీ – ఏది తక్కువైతే అది పరిహారంగా చెల్లించాలి. చార్టర్ ప్రకారం, ఇండిగో ఇప్పటికే డిసెంబర్ 9 వరకు రూ. 886 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. కాబట్టి, ఇండిగో చెల్లించాలని ఆదేశాలు జారీ అయితే వాపసు, పరిహారం విలువ దాదాపు రూ. 1,800 కోట్లు అవనుంది.

## రాష్ట్రంలో మళ్లీ హత్యలు: జగదీశ్ రెడ్డి

సూర్యాపేట, డిసెంబర్ 10 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మళ్లీ హత్యల సంస్కృతి మొదలైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆయన మండిపడ్డారు. సూర్యాపేటలో హత్యకు గురైన మల్లయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆరు నెలల క్రితం కూడా కాంగ్రెస్ పార్టీ అంతర్గత కలహాలతో ఓ హత్య జరిగిందని, పోలీసుల నిర్లక్ష్యంపై తాను అప్పుడే హెచ్చరించానని జగదీశ్ రెడ్డి గుర్తుచేశారు. అయినా వారి వైఖరిలో మార్పు రాకపోవడం వల్లే ఇప్పుడు మరో హత్య జరిగిందని విమర్శించారు. గతంలో ఈ గడ్డపై కాంగ్రెస్ నేతలు హత్యలు చేసేవారని, తాము పదేళ్ల పాలనలో ఆ సంస్కృతిని రూపుమాపితే, కాంగ్రెస్ మళ్లీ దానిని తిరిగి తీసుకొచ్చిందని ఆరోపించారు. హత్యకు గురైన మల్లయ్య కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు కేటీఆర్ రావాలనుకున్నారని, అయితే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఉద్రిక్తతలు పెరగకూడదనే ఉద్దేశంతో ఆయన పర్యటనను వాయిదా వేసుకోవాలని తామే కోరినట్లు తెలిపారు.

## మైనర్‌పై నలుగురి లైంగికదాడి

**సికింద్రాబాద్‌లో దారుణ ఘటన**

సికింద్రాబాద్, డిసెంబర్ 10 (ఈవార్తలు): సికింద్రాబాద్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. 13 ఏళ్ల బాలికపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఓ లాడ్జిలో బాలికతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు 19 ఏళ్ల యువకులు కాగా, మరో ఇద్దరు 17 ఏళ్ల మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన బాలిక ఈ నెల 4వ తేదీన అదృశ్యమైంది. దీంతో ఆందోళనకు గురైన బాలిక తల్లి, తమ కుమార్తె కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు, బాలిక సెల్‌ఫోన్ సిగ్నల్స్‌పై దృష్టి సారించారు. సిగ్నల్స్ ఆధారంగా బాలిక సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో ఉన్నట్లు గుర్తించి, వెంటనే అక్కడికి చేరుకుని నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 8న సికింద్రాబాద్ బస్ స్టేషన్ వద్ద ఒంటరిగా ఉన్న బాలికను గమనించిన నిందితులు, ఆమెకు మాయమాటలు చెప్పి లాడ్జికి తీసుకెళ్లి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**సమస్యలపై కేంద్రమంత్రులతో అర్వింద్ భేటీ**

న్యూఢిల్లీ: జగిత్యాల జిల్లాలోని పలు సమస్యలపై కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్‌ను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వేర్వేరుగా కలిశారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో పిట్ లైన్ల ఏర్పాటు చేయాలని, అలాగే పార్లమెంట్ పరిధిలోనూ పలు రైళ్లను పొడిగించాలని, వందే భారత్ సహా పలు నూతన రైళ్ల మంజూరు చేయాలని, అయ్యప్ప భక్తుల కోసం కొల్లాంకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

## శశి థరూర్‌వీర్ సావర్కర్ అవార్డు తిరస్కరణ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్.. వీర్ సావర్కర్ పేరిట ఏర్పాటు చేసిన అవార్డును తిరస్కరించారు. ఓ ఎన్జీవో సంస్థ ప్రకటించిన ఈ పురస్కారాన్ని స్వీకరించేందుకు ఆయన నిరాకరించారు. హైరేంజ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్ఆర్‌డీఎస్) అనే ఎన్జీవో.. 'వీర్ సావర్కర్ ఇంటర్నేషనల్ ఇంపాక్ట్ అవార్డు 2025'ను ఏర్పాటు చేసింది. తొలి పురస్కారానికి థరూర్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించింది. అయితే, ఈ విషయంపై థరూర్ స్పందిస్తూ.. అవార్డు స్వరూపం, దానిని అందిస్తున్న సంస్థ లేదా ఇతర వివరాలపై ఎలాంటి స్పష్టత లేదని తెలిపారు. అందువల్ల, కార్యక్రమానికి హాజరయ్యే లేదా అవార్డును స్వీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తన అనుమతి లేకుండా తన పేరును ప్రకటించడం నిర్వాహకుల బాధ్యతారాహిత్యమని ఆయన విమర్శించారు. ఈ అవార్డు గురించి తనకు నిన్న కేరళలో ఉండగా మీడియా ద్వారానే తెలిసిందని అన్నారు. వీర్ సావర్కర్‌ను బీజేపీ, దాని అనుబంధ సంస్థలు గొప్ప దేశభక్తుడిగా భావిస్తాయి. కానీ, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్రపై కాంగ్రెస్ పార్టీకి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, సావర్కర్ పేరిట ఉన్న అవార్డును స్వీకరిస్తే కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా ఉంటుందని కేరళకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత కె. మురళీధరన్ వంటి వారు అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో నేడు జరిగే ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించనున్నారు. ఇటీవల కాలంలో పార్టీ వైఖరిని విమర్శిస్తూ వార్తల్లో నిలిచినప్పటికీ, సావర్కర్ విషయంలో మాత్రం

## అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు లక్ష కోట్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా బ్యాంకులు, బీమా సంస్థలు, మ్యూచువల్ ఫండ్ల వంటి ఆర్థిక సంస్థల్లో ఎవరూ క్లెయిమ్ చేయని డబ్బు భారీగా పేరుకుపోయింది. ఈ మొత్తం రూ.1 లక్ష కోట్లు దాటినట్లు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ నేపథ్యంలో, సంబంధిత హక్కుదారులకు వారి డబ్బును తిరిగి అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'మీ డబ్బు మీ హక్కు' (యువర్ మనీ, యువర్ రైట్) కార్యక్రమాన్ని ముమ్మరం చేసింది. బుధవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ఎక్స్, లింక్డిన్ వేదికగా ప్రధాని మోదీ ఓ పోస్ట్ చేశారు. ప్రజలు మర్చిపోయిన లేదా క్లెయిమ్ చేయని డబ్బును తిరిగి పొందేందుకు ఇది మంచి అవకాశమని సూచించారు. దేశంలోని బ్యాంకుల్లో రూ. 78 వేల కోట్లు, బీమా కంపెనీల్లో రూ. 14 వేల కోట్లు, లో రూ. 3 వేల కోట్లు, డివిడెండ్ల రూపంలో మరో రూ. 9 వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని

# కేటీఆర్ ప్రమాద బీమా.. చల్మెడ ఆరోగ్య ధీమా

**సిరిసిల్లలో ఆటో, లారీ, జీపు, కార్ల డ్రైవర్లకు బీమా**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండ**

**ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు.. ప్రభుత్వ హత్యలే**

**ఏటా రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ మోసం**

**ఫ్రీ బస్సుతో ఆటోడ్రైవర్ల ఉపాధిపై దెబ్బ: కేటీఆర్**




వేములవాడ/సిరిసిల్ల, డిసెంబర్ 10 (ఈవార్తలు): 'వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమానికి నిధులు కేటాయించాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. లేదంటే ఫిబ్రవరిలో రాష్ట్రంలోని ఏడు లక్షల మంది ఆటో డ్రైవర్లతో కలిసి హైదరాబాద్‌లో మహాధర్నా చేస్తాం. రేవంత్ ప్రభుత్వాన్ని గల్లా పట్టి నిలదీస్తాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ అధికారం కోసం అలవికాని హామీలిచ్చి, విద్యార్థులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలను నమ్మించి నెత్తిన మొండి చెయ్యి పెట్టిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆటోడ్రైవర్ల ఆత్మీయ భరోసా కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్%ె% ప్రమాద బీమా కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కోల్పోయి కుటుంబాలను పోషించలేక, 162 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. ప్రతి బాధిత కుటుంబానికీ రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంచిగ అడిగితే కాంగ్రెస్ ఇవ్వదని, ఇచ్చిన హామీలన్నీ అమలయ్యే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆటోడ్రైవర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు వదిలిపెట్టబోమని స్పష్టంచేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 5 వేల మంది ఆటో డ్రైవర్లకు కేటీఆర్ సొంతంగా రూ.5లక్షల చొప్పున బీమా చేయించి అండగా నిలిచారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం బీమా చేయించగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీమా డబ్బులు చెల్లించలేదు. రెన్యువల్ చేయకపోవడంతో కార్మికుల పాలసీకి కాలం చెల్లింది. ఈ నేపథ్యంలో కార్మికుల విజ్ఞప్తి మేరకు కేటీఆర్ తానే స్వయంగా పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించి బీమా చేయించారు. జిల్లాకు చెందిన 5 వేల మంది ఆటో కార్మికులకు రెండు విడతల్లో కార్డులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. మొదటి విడతలో 2500 మంది డ్రైవర్లకు కార్డులు ఇచ్చారు. కేసీఆర్ సారథ్యంలో కొట్లాడితేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని గుర్తుచేశారు. నిలదీసి అడిగితే తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదీ ఇవ్వదని మండిపడ్డారు. మహిళలకు రూ.2వేల పింఛన్, విద్యార్థినులకు స్కూటీలు, తులం బంగారం అంటూ రకరకాల హామీలిచ్చిన కాంగ్రెస్‌ను గల్లా పట్టి నిలదీయాలని పిలుపు నిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ సర్కారు రద్దు చేసి, ప్రజలకు అన్యాయం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లకు చేసిన బీమా డబ్బులు కూడా కట్టలేదని రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు.

### చల్మెడ ఆరోగ్య ధీమా

వీర్నపల్లికి చెందిన సతీశ్ అనే ఆటో డ్రైవర్ ఉపాధి లేక, ఆర్థిక భారం మోయలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుని దవాఖాన పాలయ్యాడని కేటీఆర్ తెలిపారు. బీమా తొలగించిన విషయాన్ని డ్రైవర్లు తనతో చెప్తే ఈ ప్రభుత్వానికి సిగ్గురావాలన్న ఉద్దేశంతో.. తానే సొంత డబ్బులతో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 5వేల మంది ఆటో డ్రైవర్లకు బీమా చేయించినట్టు చెప్పారు. ఇది ఆదర్శం కావాలని, మిగతా ఎమ్మెల్యేలు ముందుకొస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి, చల్మెడ దవాఖాన నిర్వహకుడు లక్ష్మీనర్సింహారావు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆటో డ్రైవర్లందరికీ ఉచిత వైద్యం అందిస్తామని ప్రకటించారు. చల్మెడ ఆస్పత్రి తరపున త్వరలోనే ఆరోగ్య కార్డులు అందిస్తామని పేర్కొన్నారు.



# కొండగట్టు అగ్నిప్రమాద బాధితులకు చేయూత

**జగిత్యాల లేడీస్ ఎంపోరియం సంఘం తరపున నిత్యావసరాలు**

మల్యాల, డిసెంబర్ 10 (ఈవార్తలు): కొండగట్టు అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు జగిత్యాల లేడీస్ ఎంపోరియం సంఘం సభ్యులు చేయూతనందించారు. సంఘం అధ్యక్షుడు దీటి అజయ్య పటేల్ ఆధ్వర్యంలో 8 కుటుంబాలకు, లేడీస్ ఎంపోరియం అసోసియేషన్ తరపున మిగతా 15 కుటుంబాలకు నిత్యవసర వస్తువులు అందజేశారు. దుప్పట్లు, రగ్గులు, బెడ్ షీట్స్ అందించారు. భారత్ క్లాత్ శారీ సెంటర్ కటుకం అమర్నాథ్ బాధిత మహిళలకు 23 చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దీటి అజయ్య పటేల్, కొత్తపెల్లి నాగభూషణం, గాజుల మల్లికార్జున్, కోట శ్రీనివాస్, ఊటూరి శ్రీధర్, నీలి వేణుమాధవ్, కైలాశ్‌పతి అజీజ్ నూరి, కొక్కుల రమేశ్, శ్రీనివాస్, మల్లన్న, తదితరులుపాల్గొన్నారు.

# ఎన్నికల్లో భార్య భర్తలు పోటీ

**ఇద్దరికీ ఒకే గుర్తు.. ఇద్దరిదీ ఒకే లక్ష్యం**



వారిద్దరు భార్యాభర్తలు.. ప్రజాసేవ చేయడమే వారికి ఇష్టం.. ఒకరు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు.. ఆమె మహిళా సంఘం నాయకురాలు. వారిద్దరి ఆలోచన ఒక్కటే. వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలన్నదే సంకల్పం. ఇద్దరికీ వార్డుల్లో మంచి పేరుంది. అందుకే ఈ నెల 14న జరగనున్న మేజర్ పంచాయతీ మల్యాల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. 7 వార్డులో యాగండ్ల సుమన్ గౌడ్, 8 వ వార్డులో యాగండ్ల శరణ్య పోటీ చేస్తున్నారు. ఆశ్చర్యకర విషయం ఏంటంటే.. వీరిద్దరికీ అనుకోని విధంగా ఒకే గుర్తు వచ్చింది. స్టూల్ గుర్తుతో భార్యాభర్తలు చెరో వార్డులో తమ ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఈ రెండు వార్డులో నెలకొన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ దంపతులు పేర్కొంటున్నారు.

# కడప మేయర్ ఎన్నికకు లైన్ క్లియర్

**మాజీ మేయర్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు**

కడప/అమరావతి, డిసెంబర్ 10 (ఈవార్తలు): కడప మాజీ మేయర్ కె. సురేశ్ బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. కడప నగర మేయర్ పదవికి ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో, మేయర్ ఎన్నిక ప్రక్రియకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. కడప మేయర్ ఎన్నిక కోసం ఈ నెల 4న ఎస్ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, తనను మేయర్ పదవి నుంచి తొలగించడంపై వేసిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, కడప మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి గడువు 2026 మార్చి వరకు ఉందని సురేశ్ బాబు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పదవీకాలం ముగియడానికి ఆరు నెలల ముందు ఎన్నికలు నిర్వహించడం పురపాలక చట్ట నిబంధనలకు విరుద్ధమని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. ఈ వాదనలను ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది వ్యతిరేకించారు. ఆరు నెలల నిబంధన సభ్యుల ఎన్నికలకు మాత్రమే వర్తిస్తుందని, పరోక్ష పద్ధతిలో జరిగే మేయర్ ఎన్నికకు ఇది వర్తించదని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం, సురేశ్ బాబు పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పుతో, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే మేయర్ ఎన్నిక జరగనుంది. ఇప్పటికే కడప జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదితి సింగ్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. డిసెంబర్ 11న ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్-అఫీషియో సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మేయర్‌ను ఎన్నుకోనున్నారు.

# హిందువులపై జగన్‌కు ద్వేషం: జ్యోతుల నెహ్రూ

అమరావతి, డిసెంబర్ 10 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ తీరు చూస్తే ఆయనకు హిందువుల పట్ల ఉన్న ద్వేషం అర్థమవుతోందని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తీవ్రస్థాయిలో విమర్శించారు. తిరుమల పరకామణి చోరీ కేసు విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని ఆయన మీడియా సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామివారి హుండీ కానుకల లెక్కింపు కేంద్రమైన పరకామణిలో వందల కోట్ల రూపాయల చోరీ జరిగిందని, దానిని ఒక చిన్న దొంగతనంగా చూపించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని నెహ్రూ మండిపడ్డారు. "వేల కోట్లు దోచుకున్న మీకు పరకామణి చోరీ చిన్నదిగా కనిపించడం సహజమే. ఈ కేసులో జగన్, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డిల పాత్ర నూటికి నూరు శాతం ఉందనేది వాస్తవం" అని ఆయన ఆరోపించారు. గతంలో వైఎస్ వివేకానంద రెడ్డి, పరిటాల రవి హత్య కేసుల్లో సాక్షులను ఎలా అంతమొందించారో ఇప్పుడు కూడా అదే పద్ధతిని అమలు చేస్తున్నారని జ్యోతుల నెహ్రూ విమర్శించారు. "నిజాలను నిరూపించేందుకు ప్రయత్నించేవారిని వేధించడం, భయపెట్టడం, అవసరమైతే హత్యలు చేయడం వీరికి అలవాటుగా మారింది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కేసును కూడా తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

# ప్రపంచంలో ఎక్కడా ఇలా జరగడంలేదు

వైజాగ్, డిసెంబర్ 10 (ఈవార్తలు): ఏపీలో వైద్య విద్యను పూర్తిగా ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వైసీపీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా ఇలా జగరడంలేదని అన్నారు. విజయనగరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని బొత్స తెలిపారు. త్వరలోనే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో గవర్నర్‌ను కలిసి ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. "చంద్రబాబు నైజం ఎప్పుడూ కార్పొరేట్లకు అనుకూలంగానే ఉంటుంది. ఇది కొత్తేమీ కాదు, ఆయన తీరు మొదటి నుంచీ ఇంతే" అని ఆయన వ్యాఖ్యానించారు. గత వైసీపీ ప్రభుత్వం పేదల కోసం మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం వాటికి కనీస నిధులు కూడా ఇవ్వడం లేదని బొత్స ఆరోపించారు. దీనివల్ల మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నుంచి అనుమతులు రాకుండా పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంపై ఉన్న రూ. 2.60 లక్షల కోట్ల అప్పుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి, నిధులు ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గుర్ల మండలంలో ప్రతిపాదించిన స్టీల్ ప్లాంట్ విషయంలో రైతుల అభిప్రాయానికే తమ ప్రాధాన్యత అని బొత్స స్పష్టం చేశారు. ఎక్కువ మంది రైతులు వ్యతిరేకిస్తే, వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

# ఏపీలో అగ్రి ఎక్విప్‌మెంట్ బ్యాంక్

**సీఎం చంద్రబాబు వినూత్న నిర్ణయం**



అమరావతి, డిసెంబర్ 10 (ఈవార్తలు): ఏపీలో రైతులపై సాగు వ్యయ భారాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తూ, ఆధునిక యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు 'అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి, మిర్చి సహా వాణిజ్య పంటల కొనుగోళ్లపై బుధవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. శాస్త్రీయ విధానంలో పంటల ప్రణాళిక, ఆధునిక యంత్రాలు, డ్రోన్ల వినియోగం ద్వారా సాగు ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్‌ను ప్రారంభించి, అందులో అందుబాటులో ఉన్న పరికరాల వివరాలను పొందుపరచాలని సూచించారు. ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు ఉండాలని, వరికి ప్రత్యామ్నాయంగా రాగులు, జొన్నలు, సజ్జల వంటి చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు సీఎంకు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 2,606 కొనుగోలు కేంద్రాల ద్వారా 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. రైతులకు 7.39 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రూ.4,085 కోట్లు చెల్లించామని వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 32 శాతం అధికమని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఎం, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఎన్డీఏ ప్రజాప్రతినిధులంతా కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు భరోసా ఇవ్వాలని సూచించారు. రబీ సీజన్‌లో ప్రజలు తినే వరి రకాల సాగుతో పాటు వాటి కొనుగోలు, అంతర్జాతీయ మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# త్వరలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తా

**గుడివాడలో కొడాలి నాని స్పష్టీకరణ**



గుడివాడ, డిసెంబర్ 10 (ఈవార్తలు): సార్వత్రిక ఎన్నికల తర్వాత దాదాపు 18 నెలలుగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న మాజీ మంత్రి, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని తిరిగి క్రియాశీలకంగా మారారు. అనారోగ్యం, ఇతర కారణాలతో కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనని ఆయన, ఈరోజు గుడివాడలో వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో ఆయన పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు అందించే వినతిపత్రంపై కొడాలి నాని సంతకం చేశారు. అనంతరం, పార్టీ శ్రేణులు సేకరించిన వినతిపత్రాలను జిల్లా కమిటీకి అందించేందుకు ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సుదీర్ఘ విరామం తర్వాత తమ నాయకుడిని చూసిన కార్యకర్తలు ఉత్సాహం ప్రదర్శించారు. కొడాలి నాని కూడా వారితో ఉత్సాహంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తేవాలన్న గొప్ప సంకల్పంతో మాజీ సీఎం జగన్ 17 మెడికల్ కళాశాలలను ప్రారంభించారని తెలిపారు. వైసీపీ హయాంలో ఐదు కాలేజీలు పూర్తయ్యాయని, మరో ఐదు తుది దశలో ఉన్నాయని తెలిపారు. పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం దుర్మార్గపు చర్య అని ఆయన మండిపడ్డారు. ప్రజల నుంచి తమ ఉద్యమానికి మంచి స్పందన వస్తోందని, ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సేకరించిన వినతిపత్రాలను త్వరలో గవర్నర్‌కు అందజేస్తామని కొడాలి నాని తెలిపారు.

# పట్టు శాలువాల పేరుతో పాలిస్టర్ దందా

**తిరుమలలో మరో భారీ స్కామ్?**

తిరుమల, డిసెంబర్ 10 (ఈవార్తలు): కలియుగ దైవం తిరుమల శ్రీవారి సన్నిధిలో వరుస కుంభకోణాలు బయటపడటం భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పరకామణిలో చోరీ, కల్తీ నెయ్యి సరఫరా వంటి ఘటనలు మరువక ముందే ఇప్పుడు పట్టు శాలువాల కొనుగోళ్లలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. శ్రీవారికి విరాళాలు ఇచ్చే దాతలు, వీఐపీలకు అందించే మల్బరీ పట్టు శాలువాలకు బదులుగా, ఓ సంస్థ పదేళ్లుగా 100 శాతం పాలిస్టర్ శాలువాలను సరఫరా చేసినట్లు టీటీడీ విజిలెన్స్ తనిఖీల్లో తేలింది. వివరాల్లోకి వెళితే.. శ్రీవారిని దర్శించుకునే దాతలు, వీఐపీలకు రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించి, పట్టు శాలువాతో సత్కరించడం ఆనవాయతీ. దీని కోసం టీటీడీ ఏటా కోట్ల రూపాయలు వెచ్చించి పట్టు శాలువాలను కొనుగోలు చేస్తుంది. అయితే, నగరికి చెందిన వీఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్ అనే సంస్థ 2015 నుంచి టెండర్ దక్కించుకుని శాలువాలు సరఫరా చేస్తోంది. ఇటీవల టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు ఈ శాలువాల నాణ్యతపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టెండర్ నిబంధనల ప్రకారం స్వచ్ఛమైన మల్బరీ పట్టుతో, నిర్దిష్టమైన బరువు, పరిమాణంలో శాలువాలు నేయాలి. వాటిపై 'ఓం నమో వేంకటేశాయ' అనే అక్షరాలతో పాటు శంకు, చక్ర నామాలు ఉండాలి. కానీ, సరఫరా అయిన శాలువాలు పూర్తి పాలిస్టర్‌తో ఉన్నాయని తేలింది. కేవలం రూ.350 నుంచి రూ.400 విలువ చేసే ఈ నాసిరకం శాలువాలను ఒక్కొక్కటి రూ.1,389 చొప్పున టీటీడీకి విక్రయించి సంస్థ మోసానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు.

# నా శాఖలో 10 వేల ప్రమోషన్లు : పవన్



మంగళగిరి, డిసెంబర్ 10 (ఈవార్తలు): గత ప్రభుత్వ హయాంలో బదిలీలు, పదోన్నతులకు రేట్ కార్డ్ పెట్టి వ్యాపారం చేశారని, తమ ప్రభుత్వంలో మాత్రం పారదర్శకంగా అర్హతకే ప్రాధాన్యత ఇచ్చామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో నిర్వహించిన 'మాటామంతీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన శాఖలో పెండింగ్‌లో ఉన్న 10 వేల పదోన్నతులను పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. పల్లెలే దేశానికి వెన్నెముక అనే నమ్మకంతోనే పంచాయతీరాజ్ శాఖను తాను తీసుకున్నానని పవన్ తెలిపారు. తన తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగేనని, ప్రమోషన్ కోసం ఒక కుటుంబం ఎలా ఎదురుచూస్తుందో తనకు తెలుసని గుర్తుచేసుకున్నారు. అందుకే బాధ్యతలు చేపట్టగానే పదోన్నతులపై దృష్టి సారించానన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు సిఫార్సు చేసినా అర్హత, అనుభవం, పనితీరు ఆధారంగానే ప్రమోషన్లు ఇచ్చామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొందరు ఉద్యోగులు తమ సమస్యలను పవన్ దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు సకాలంలో సంతకాలు చేయకపోవడంతో జీతాలు, బిల్లులు ఆలస్యమవుతున్నాయని వాపోయారు. దీనిపై తీవ్రంగా స్పందించిన పవన్ కల్యాణ్, నిర్లక్ష్యంగా వ్యవహరించే సర్పంచ్‌ల జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల జీతాలు ఆలస్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారిపై ఎవరు దాడులు చేసినా కఠినంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని బయటకు తీస్తామన్నారు.

# ఏపీకి 'జూమ్'

**శాన్ ఫ్రాన్సిస్కోలో నారా లోకేశ్ కీలక భేటీ**

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికాలో పర్యటిస్తున్న ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించేందుకు తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా, ప్రముఖ వీడియో కమ్యూనికేషన్స్ సంస్థ 'జూమ్' ఉన్నతాధికారులతో శాన్ ఫ్రాన్సిస్కోలో సమావేశమయ్యారు. ఈ భేటీలో జూమ్ సంస్థ ప్రొడక్ట్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ప్రెసిడెంట్ వెల్చామి శంకరలింగం, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణ బావాతో లోకేశ్ చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్రంలోని అమరావతి లేదా విశాఖపట్నంలో జూమ్ సంస్థ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డి), ఇంజనీరింగ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ వారిని కోరారు. అలాగే, విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం ఉందని లోకేశ్ వారికి తెలిపారు. ఈ సమావేశం వివరాలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# మీ మతంలో జరిగితే ఓకేనా?

**జగన్‌పై పవన్ కల్యాణ్ ఫైర్**

అమరావతి, డిసెంబర్ 10 (ఈవార్తలు): తిరుమల పరకామణిలో జరిగిన చోరీని చిన్న దొంగతనం అని వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యానించడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఇదే ఘటన మీ మతంలో జరిగి ఉంటే మీరు ఇలాగే స్పందించేవారా?" అని జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన, భారత రాజ్యాంగం అన్ని మతాలకు సమానంగా వర్తిస్తుందని ఉద్ఘాటించారు. ఇస్లాం, క్రైస్తవ మతాలకు ఒకలా.. హిందూ మతానికి మరోలా నిబంధనలు ఉండవనని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో తిరుమలలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని పవన్ ఆరోపించారు. ఆ అక్రమాలన్నీ ఇప్పుడు బయటపడుతున్నాయని అన్నారు. ఇటీవల పట్టు శాలువాల పేరుతో పాలిస్టర్ వస్త్రాలు సరఫరా చేసిన కుంభకోణం వెలుగులోకి వచ్చిందని గుర్తుచేశారు. తిరుమలలో జరిగిన అన్ని అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని తెలిపారు. ఈ సందర్భంగా హిందూ సమాజంపై జరుగుతున్న వివక్ష గురించి ఆయన ప్రస్తావించారు. "హిందువులు మెజారిటీ అనడం ఒక భ్రమ. కులం, మతం, భాష, ప్రాంతాల వారీగా హిందువులు విడిపోయి ఉన్నారు" అని పవన్ వ్యాఖ్యానించారు.

# చప్పిడి తిండి!

**భారతీయుల ప్రోటీన్‌లో సగం బియ్యం, గోధుమలే**

**ఇది నాణ్యత లేని ప్రోటీన్ అని అధ్యయనంలో వెల్లడి**

**కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాల వాడకం చాలా తక్కువ**

**ప్రమాదకర స్థాయిలో నూనె, ఉప్పు, చక్కెర వినియోగం**

న్యూఢిల్లీ: భారతీయుల ఆహారపు అలవాట్లపై ఓ అధ్యయనంలో ఆందోళన కలిగించే విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశ ప్రజలు తమకు అవసరమైన ప్రోటీన్‌లో దాదాపు సగం బియ్యం, గోధుమ, రవ్వ, మైదా వంటి ధాన్యాల నుంచే పొందుతున్నారని తాజా నివేదిక స్పష్టం చేసింది. అయితే, ఇది నాణ్యత లేని ప్రోటీన్ అని, సులభంగా జీర్ణం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలసీ రీసెర్చ్ సంస్థ 'కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్' (సీఈఈడబ్ల్యూ) ఈ అధ్యయనాన్ని బుధవారం విడుదల చేసింది. దీని ప్రకారం, భారతీయులు సగటున రోజుకు 55.6 గ్రాముల ప్రోటీన్ తీసుకుంటున్నా, దాని నాణ్యతపైనే ప్రధాన ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు, ఆహారంలో కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాల వాడకం చాలా తక్కువగా ఉండగా, వంట నూనెలు, ఉప్పు, చక్కెర వినియోగం అధికంగా ఉన్నట్లు తేలింది. "భారత ఆహార వ్యవస్థలో ఇదొక నిశ్శబ్ద సంక్షోభం. తక్కువ నాణ్యత గల ప్రోటీన్‌పై ఆధారపడటం, ధాన్యాలు, నూనెల ద్వారా అధిక కేలరీలు తీసుకోవడం, పోషకాలున్న ఆహారాన్ని తక్కువగా తినడం వంటివి తీవ్ర అసమతుల్యతకు దారితీస్తున్నాయి" అని సీఈఈడబ్ల్యూ ఫెలో అపూర్వ ఖండేల్వాల్ తెలిపారు. పేద, ధనిక వర్గాల మధ్య ఆహార వినియోగంలో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయని ఆమె వివరించారు. 2023-24 ఎన్ఎస్ఎస్ఓ సర్వే డేటా ఆధారంగా ఈ విశ్లేషణ చేశారు. గత దశాబ్ద కాలంలో జొన్నలు, సజ్జలు, రాగులు వంటి చిరుధాన్యాల వినియోగం ఏకంగా 40% పడిపోయిందని నివేదిక పేర్కొంది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్), పీఎం పోషణ్, అంగన్‌వాడీ వంటి ప్రభుత్వ పథకాలలో కేవలం బియ్యం, గోధుమలకే పరిమితం కాకుండా.. చిరుధాన్యాలు, పప్పులు, పాలు, గుడ్లు, పండ్లు వంటివి కూడా చేర్చాలని అధ్యయనం సిఫార్సు చేసింది.



## ఏం మాట్లాడాలో నాకు తెలుసు

**నాకు చెప్పొద్దు.. నా అనుభవం 30 ఏళ్లు!**

**రాహుల్ పై అమిత్ షా ఫైర్**

న్యూఢిల్లీ: లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎన్నికల సంస్కరణలపై జరుగుతున్న చర్చలో రాహుల్ గాంధీ అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అమిత్ షా ఘాటుగా స్పందించారు. "మీ ఆదేశాలతో పార్లమెంట్ నడవదు... సభా సమావేశాలను మీరు శాసించలేరు" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ కల్పించుకుని, "ముందు నిన్న నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి" అని డిమాండ్ చేశారు. దీనిపై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. తనకు అసెంబ్లీ, పార్లమెంటులో 30 ఏళ్ల అనుభవం ఉందని, తాను ఎప్పుడు మాట్లాడాలో మీరు నిర్దేశించలేరని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను అమిత్ షా తిప్పికొట్టారు. విపక్షాలు 'ఓట్ల దొంగతనం' అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల జాబితా నుంచి మరణించిన వారిని, విదేశీ పౌరులను తొలగించడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని స్పష్టం చేశారు. "చట్టవిరుద్ధ వలసదారులు ఎన్నికల్లో పాల్గొనాలా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 1952 నుంచి 2004 వరకు అనేకసార్లు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ఓటర్ల జాబితా సవరణలు జరిగాయని గుర్తుచేశారు. "జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు ఎవరూ దీనిని వ్యతిరేకించలేదు. మరి ఇప్పుడెందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారు?" అని నిలదీశారు.

## నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లపై నిర్ణయం ప్రకటించనున్న నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడంతో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 275.01 పాయింట్ల నష్టంతో 84,391.27 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 81.65 పాయింట్లు కోల్పోయి 25,758 వద్ద ముగిసింది. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి జోన్‌లో బలమైన నిరోధం ఎదురవుతోంది. మార్కెట్ మళ్లీ పుంజుకోవాలంటే 26,000 స్థాయిని కచ్చితంగా దాటాల్సి ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# మోదీ హ్యాక్ చేసేది మనసులను!

**ఈవీఎంలను కాదు.. ఓట్ చోరీ నిరాధారం**

**పార్లమెంటులో ఎంపీ కంగనా రనౌత్**



న్యూఢిల్లీ: 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హ్యాక్ చేస్తోంది ఈవీఎంలను కాదు.. దేశ ప్రజల హృదయాలను' అంటూ బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్ లోక్‌సభలో వ్యాఖ్యానించారు. బుధవారం ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆమె, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ ను గట్టిగా సమర్థించారు. ప్రతిపక్షాలు చేస్తున్న 'ఓట్ల దొంగతనం' ఆరోపణలను నిరాధారమైన ప్రచారంగా కొట్టిపారేశారు. ఈ ప్రక్రియ దేశ భద్రతకు, మహిళల ఆత్మగౌరవానికి ఎంతో కీలకమని ఆమె ఉద్ఘాటించారు. గత ఏడాది కాలంగా పార్లమెంటులో తన అనుభవాలు చాలా బాధ కలిగించాయని కంగనా ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రతిపక్ష సభ్యులు మమ్మల్ని ప్రతిరోజూ బెదిరిస్తున్నారు, భయపెడుతున్నారు. మేమిక్కడ నేర్చుకోవడానికి, దేశానికి సేవ చేయడానికి వస్తే, వారు సభను ముందుకు సాగనివ్వడం లేదు" అని ఆమె ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగానే సభా కార్యకలాపాలను అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కంగనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రాహుల్ గాంధీ ఏదో పెద్ద రహస్యం బయటపెడతారని ఆశించాను. కానీ మళ్లీ అదే విదేశీ మహిళ ఫొటోను 22 సార్లు ఓటర్ ఐడీలో వాడారంటూ పాత ఆరోపణే చేశారు. కానీ ఆ మహిళ అసలు భారత్‌కే రాలేదని స్వయంగా స్పష్టం చేసింది. ఆ మహిళకు ఈ సభ తరఫున నేను క్షమాపణ చెబుతున్నాను" అని అన్నారు. ప్రతిపక్షాలు తన ఫొటోలను ప్రదర్శించి తనను అవమానించారని, ఇది మహిళల గౌరవానికి భంగం కలిగించడమేనని ఆమె మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం 'బేటీ బచావో, బేటీ పఢావో' వంటి పథకాలతో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని గుర్తుచేశారు. పేపర్ బ్యాలెట్ కావాలంటున్న కాంగ్రెస్‌కు కంగనా చరిత్రను గుర్తుచేశారు. "ఇందిరా గాంధీ వర్సెస్ రాజ్‌నారాయణ్ కేసును గుర్తుచేసుకోవాలి. ఆ కేసులో ఇందిర అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో ఒక్క రాత్రిలో పదవిని ఖాళీ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు పేపర్ బ్యాలెట్ కావాలంటున్న వారు ఆ చరిత్రను మరిచిపోయినట్లున్నారు" అని చురకలంటించారు. గాంధీ కుటుంబంపై కంగనా తన దాడిని కొనసాగించారు. "ప్రియాంకా గాంధీజీ, ప్రజలు కొన్నిసార్లు ఇతరుల దయపై ఆధారపడవచ్చు. కానీ ఈ దేశ చట్టాలు రాజకీయ కుటుంబాలను కాపాడటానికి కాదు. సోనియా గాంధీకి పౌరసత్వం లేకుండానే 1983 నుంచి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది రికార్డుల్లో ఉంది. ఇదేనా ప్రజాస్వామ్యం?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణను ఒక 'శుద్ధీకరణ ప్రక్రియ'గా అభివర్ణించిన కంగనా, బీహార్ ఉదాహరణను ప్రస్తావించారు. "బీహార్‌లో 60 లక్షలకు పైగా వలసదారులు, అనుమానాస్పద ఓట్లను తొలగించారు. ఆ తర్వాత అక్కడ 67 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ప్రక్షాళన దేశవ్యాప్తంగా జరగాలి" అని స్పష్టం చేశారు. చివరగా, 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' విధానాన్ని దేశంలో తప్పనిసరిగా ప్రవేశపెట్టాలని ఆమె గట్టిగా డిమాండ్ చేశారు.

# 'చిన్నస్వామి'లో ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగేనా?

**నేడు తేల్చనున్న కర్ణాటక కేబినెట్**



బెంగళూరు: బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు గురువారం తెరపడనుంది. కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ తెలిపారు. బుధవారం బెలగావిలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంతకుముందు, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన భారత మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్, ఇతర నూతన కార్యవర్గ సభ్యులు శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, "క్రికెట్ మ్యాచ్‌లను ఆపాలన్న ఉద్దేశం మాకు లేదు. కానీ, ప్రేక్షకుల నిర్వహణ, భద్రతా చర్యలను తప్పకుండా పరిశీలించాల్సి ఉంది. జస్టిస్ మైఖేల్ డి'కున్హా కమిటీ సిఫార్సులను దశలవారీగా అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దీనికి వెంకటేశ్ ప్రసాద్ కూడా అంగీకరించారు" అని వివరించారు. క్రికెట్ అభిమానుల మనోభావాలను గౌరవిస్తూనే, రాష్ట్ర గౌరవానికి భంగం కలగకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. "ఐపీఎల్ అయినా, మరే ఇతర మ్యాచ్ అయినా బెంగళూరు నుంచి తరలించడానికి మేం అంగీకరించం. ప్రభుత్వం, కేఎస్‌సీఏ కలిసి పనిచేయాలి. అవసరమైతే కొత్త స్టేడియాల నిర్మాణం గురించి కూడా చర్చిస్తాం" అని శివకుమార్ పేర్కొన్నారు. జవగళ్ శ్రీనాథ్, అనిల్ కుంబ్లే వంటి దిగ్గజాల మద్దతుతో ఎన్నికైన వెంకటేశ్ ప్రసాద్ బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. జూన్ 4న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలిచిన సందర్భంగా జరిగిన సంబరాల్లో తొక్కిసలాట జరిగి 11 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటన తర్వాత చిన్నస్వామి స్టేడియంలో ఎలాంటి మ్యాచ్‌లు జరగలేదు. నిర్వాహకులపై కేసు నమోదు కావడంతో పాటు, స్టేడియం భద్రతపై ప్రభుత్వం పూర్తిస్థాయి ఆడిట్ తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో రేపు ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## శశి థరూర్ వీర్ సావర్కర్ అవార్డు తిరస్కరణ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్.. వీర్ సావర్కర్ పేరిట ఏర్పాటు చేసిన అవార్డును తిరస్కరించారు. ఓ ఎన్జీవో సంస్థ ప్రకటించిన ఈ పురస్కారాన్ని స్వీకరించేందుకు ఆయన నిరాకరించారు. హైరేంజ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్ఆర్‌డీఎస్) అనే ఎన్జీవో.. 'వీర్ సావర్కర్ ఇంటర్నేషనల్ ఇంపాక్ట్ అవార్డు 2025'ను ఏర్పాటు చేసింది. తొలి పురస్కారానికి థరూర్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించింది. అయితే, ఈ విషయంపై థరూర్ స్పందిస్తూ.. అవార్డు స్వరూపం, దానిని అందిస్తున్న సంస్థ లేదా ఇతర వివరాలపై ఎలాంటి స్పష్టత లేదని తెలిపారు. అందువల్ల, కార్యక్రమానికి హాజరయ్యే లేదా అవార్డును స్వీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తన అనుమతి లేకుండా తన పేరును ప్రకటించడం నిర్వాహకుల బాధ్యతారాహిత్యమని ఆయన విమర్శించారు. ఈ అవార్డు గురించి తనకు నిన్న కేరళలో ఉండగా మీడియా ద్వారానే తెలిసిందని అన్నారు. వీర్ సావర్కర్‌ను బీజేపీ, దాని అనుబంధ సంస్థలు గొప్ప దేశభక్తుడిగా భావిస్తాయి. కానీ, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్రపై కాంగ్రెస్ పార్టీకి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, సావర్కర్ పేరిట ఉన్న అవార్డును స్వీకరిస్తే కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా ఉంటుందని కేరళకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత కె. మురళీధరన్ వంటి వారు అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో నేడు జరిగే ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించనున్నారు. ఇటీవల కాలంలో పార్టీ వైఖరిని విమర్శిస్తూ వార్తల్లో నిలిచినప్పటికీ, సావర్కర్ విషయంలో మాత్రం థరూర్ పార్టీ సిద్ధాంతాలకే కట్టుబడినట్లు ఈ సంఘటన స్పష్టం చేస్తోంది.

## అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు లక్ష కోట్లు

**మీ డబ్బు మీకే.. ప్రధాని మోదీ వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా బ్యాంకులు, బీమా సంస్థలు, మ్యూచువల్ ఫండ్ల వంటి ఆర్థిక సంస్థల్లో ఎవరూ క్లెయిమ్ చేయని డబ్బు భారీగా పేరుకుపోయింది. ఈ మొత్తం రూ.1 లక్ష కోట్లు దాటినట్లు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ నేపథ్యంలో, సంబంధిత హక్కుదారులకు వారి డబ్బును తిరిగి అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'మీ డబ్బు మీ హక్కు' (యువర్ మనీ, యువర్ రైట్) కార్యక్రమాన్ని ముమ్మరం చేసింది. బుధవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ఎక్స్, లింక్డిన్ వేదికగా ప్రధాని మోదీ ఓ పోస్ట్ చేశారు. ప్రజలు మర్చిపోయిన లేదా క్లెయిమ్ చేయని డబ్బును తిరిగి పొందేందుకు ఇది మంచి అవకాశమని సూచించారు. దేశంలోని బ్యాంకుల్లో రూ. 78 వేల కోట్లు, బీమా కంపెనీల్లో రూ. 14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్లలో రూ. 3 వేల కోట్లు, డివిడెండ్ల రూపంలో మరో రూ. 9 వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని ఆయన తన పోస్టులో వివరించారు. గతేడాది ప్రారంభమైన ఈ కార్యక్రమం అమలు తీరుపై కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఇటీవల రాజ్యసభలో కీలక ప్రకటన చేశారు. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లోనే దేశవ్యాప్తంగా ప్రత్యేక శిబిరాల ద్వారా అర్హులను గుర్తించి రూ. 2,000 కోట్లు తిరిగి చెల్లించినట్లు తెలిపారు. ప్రజలకు వారి ప్రాంతీయ భాషల్లోనే అవగాహన కల్పిస్తున్నామని, సందేహాలను నివృత్తి చేస్తున్నామని చెప్పారు. పాత బ్యాంకు ఖాతాలు, ఇన్సూరెన్స్ పాలసీలు, షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్లలో తమకు తెలియని డబ్బులు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ప్రజలకు పలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఆయా సంస్థల అధికారిక వెబ్‌సైట్లలో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆర్‌బీఐ తీసుకొచ్చిన 'ఉద్గమ్' పోర్టల్ ద్వారా కూడా సులభంగా వివరాలు తెలుసుకోవచ్చు.

## 2030 నాటికి ఇండియా నం.1

**భారత డెవలపర్లపై సత్య నాదెళ్ల ప్రశంసలు**

న్యూఢిల్లీ: ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. రానున్న నాలుగేళ్లలో దేశంలో 17.5 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల తెలిపారు. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి ఇదే కావడం విశేషం. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో సత్య నాదెళ్ల మాట్లాడుతూ... 2030 నాటికి 5.75 కోట్ల మంది డెవలపర్లతో ప్రపంచంలోనే అతిపెద్ద డెవలపర్ కమ్యూనిటీగా భారత్ అవతరించనుందని జోస్యం చెప్పారు. నూతన తరం కృత్రిమ మేధ (ఏఐ) ఆవిష్కరణలలో భారతదేశం నాయకత్వ పాత్ర పోషిస్తోందని ఆయన ప్రశంసించారు. "భారతీయ డెవలపర్లు ఇప్పటికే గిట్‌హబ్, అజూర్, మా కొత్త ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించి అధునాతన ప్రాజెక్టులపై పనిచేస్తున్నారు" అని ఆయన వివరించారు. ఏఐ అప్లికేషన్లను నిర్మించేందుకు యాప్‌బిల్డర్, కోపైలట్ స్టూడియో, ఫౌండ్రీ వంటి కొత్త సాధనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు నాదెళ్ల తెలిపారు. ఇకపై ఒకే ఏఐ మోడల్‌పై కాకుండా డెవలపర్లు తమకు నచ్చిన మోడల్‌ను ఎంచుకుని, దానిని విశ్వాసంతో ఉపయోగించేలా ఒక విస్తృత వ్యవస్థను నిర్మిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రకటనకు ముందు సత్య నాదెళ్ల ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. భారత్ ఏఐ అవకాశాలపై ప్రధానితో చర్చ స్ఫూర్తిదాయకంగా సాగిందని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో తెలిపారు. దేశ ఏఐ భవిష్యత్తుకు మద్దతుగా, అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలను నిర్మించేందుకే ఈ భారీ పెట్టుబడి పెడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

## అదానీతో సత్య నాదెళ్ల భేటీ

**ఏఐ భవిష్యత్తుపై కీలక చర్చలు**

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల.. బుధవారం అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీతో సమావేశమయ్యారు. ఈ భేటీ సందర్భంగా సాంకేతికత భవిష్యత్తు, ఏఐ విస్తృత అవకాశాలపై ఇరువురు చర్చించుకున్నారు. అనంతరం గౌతమ్ అదానీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ, "సత్య నాదెళ్లను కలవడం, టెక్నాలజీ భవిష్యత్తుపై ఆయన అమూల్యమైన అభిప్రాయాలు తెలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఏఐ యుగంలో డిజిటల్, భౌతిక ప్రపంచాలు ఏకమవుతున్న తరుణంలో మైక్రోసాఫ్ట్‌తో 360 డిగ్రీల భాగస్వామ్యాన్ని నిర్మించేందుకు మేం ఉత్సాహంగా ఉన్నాం" అని పేర్కొన్నారు. సత్య నాదెళ్ల స్వయంగా రూపొందిస్తున్న ఏఐ యాప్స్ డెమోను చూడటం, గొప్ప నాయకుల నాయకత్వ పటిమకు నిదర్శనమని అదానీ ప్రశంసించారు. భారత్‌లో 'ఏఐ టూర్'లో భాగంగా పర్యటిస్తున్న సత్య నాదెళ్ల, అదానీతో భేటీకి ముందు ప్రధాని నరేంద్ర మోదీతోనూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్‌లో పెట్టబోయే భారీ పెట్టుబడి వివరాలను వెల్లడించారు. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ పెట్టే అతిపెద్ద పెట్టుబడి ఇదేనని ఆయన తెలిపారు. ఈ సమావేశంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. ఏఐ విషయంలో ప్రపంచం మొత్తం భారత్ వైపు ఆశాభావంతో చూస్తోందన్నారు. "భారత యువత ఏఐ శక్తిని సద్వినియోగం చేసుకొని, వినూత్న ఆవిష్కరణలతో మెరుగైన ప్రపంచానికి కృషి చేస్తుందని విశ్వసిస్తున్నాను" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం ఏఐ ప్రయాణంలో ఒక కీలకమైన దశలో ఉందని, ఈ సాంకేతికత సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని మైక్రోసాఫ్ట్ అభిప్రాయపడింది.

# అదానీతో సత్య నాదెళ్ల భేటీ

**ఏఐ భవిష్యత్తుపై కీలక చర్చలు**

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల.. బుధవారం అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీతో సమావేశమయ్యారు. ఈ భేటీ సందర్భంగా సాంకేతికత భవిష్యత్తు, ఏఐ విస్తృత అవకాశాలపై ఇరువురు చర్చించుకున్నారు. అనంతరం గౌతమ్ అదానీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ, "సత్య నాదెళ్లను కలవడం, టెక్నాలజీ భవిష్యత్తుపై ఆయన అమూల్యమైన అభిప్రాయాలు తెలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఏఐ యుగంలో డిజిటల్, భౌతిక ప్రపంచాలు ఏకమవుతున్న తరుణంలో మైక్రోసాఫ్ట్‌తో 360 డిగ్రీల భాగస్వామ్యాన్ని నిర్మించేందుకు మేం ఉత్సాహంగా ఉన్నాం" అని పేర్కొన్నారు. సత్య నాదెళ్ల స్వయంగా రూపొందిస్తున్న ఏఐ యాప్స్ డెమోను చూడటం, గొప్ప నాయకుల నాయకత్వ పటిమకు నిదర్శనమని అదానీ ప్రశంసించారు. భారత్‌లో 'ఏఐ టూర్'లో భాగంగా పర్యటిస్తున్న సత్య నాదెళ్ల, అదానీతో భేటీకి ముందు ప్రధాని నరేంద్ర మోదీతోనూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్‌లో పెట్టబోయే భారీ పెట్టుబడి వివరాలను వెల్లడించారు. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ పెట్టే అతిపెద్ద పెట్టుబడి ఇదేనని ఆయన తెలిపారు. ఈ సమావేశంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. ఏఐ విషయంలో ప్రపంచం మొత్తం భారత్ వైపు ఆశాభావంతో చూస్తోందన్నారు. "భారత యువత ఏఐ శక్తిని సద్వినియోగం చేసుకొని, వినూత్న ఆవిష్కరణలతో మెరుగైన ప్రపంచానికి కృషి చేస్తుందని విశ్వసిస్తున్నాను" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం ఏఐ ప్రయాణంలో ఒక కీలకమైన దశలో ఉందని, ఈ సాంకేతికత సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని మైక్రోసాఫ్ట్ అభిప్రాయపడింది.

## జన్మతః పౌరసత్వం బానిసల పిల్లలకే

**ధనిక వలసదారులకు కాదు: ట్రంప్**

వాషింగ్టన్: అమెరికాలో జన్మతః పౌరసత్వం (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) అనేది బానిసల పిల్లల కోసం ఉద్దేశించిందే తప్ప, ఇతర దేశాల నుంచి వచ్చే ధనిక వలసదారులు తమ కుటుంబం మొత్తానికి పౌరసత్వం కల్పించుకోవడానికి కాదని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వివాదంపై సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించిన కొద్ది రోజులకే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికన్ న్యూస్ అవుట్‌లెట్ పొలిటికోతో మాట్లాడుతూ, తన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను ట్రంప్ సమర్థించుకున్నారు. "చారిత్రకంగా చూస్తే ఈ కేసు అంతర్యుద్ధం సమయంలో బానిసల పిల్లలకు సంబంధించినది. అంతేగానీ, ఏదో ఒక ధనిక దేశం నుంచి వచ్చిన వ్యక్తి మన దేశంలో అడుగుపెట్టి, వారి కుటుంబం మొత్తాన్ని అమెరికా పౌరులుగా మార్చడానికి కాదు.

## తక్కువ ధరలు.. ఎక్కువ జీతాలు

**అమెరికన్ల ఓట్ల కోసం ట్రంప్ కొత్త నినాదం**

వాషింగ్టన్: అంతర్జాతీయంగా తీవ్రమైన టారిఫ్ యుద్ధాలు, వివాదాస్పద వ్యాఖ్యలతో నిత్యం వార్తల్లో ఉండే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు సొంత దేశ ప్రజల సమస్యలపై దృష్టి సారించారు. అమెరికాలో అధిక ధరలు, పెరుగుతున్న జీవన వ్యయం ఓటర్లను తీవ్రంగా వేధిస్తుండటంతో, ఆయన తన వ్యూహాన్ని మార్చుకున్నారు. మంగళవారం కీలకమైన స్వింగ్ స్టేట్ అయిన పెన్సిల్వేనియాలో 'తక్కువ ధరలు, ఎక్కువ జీతాలు' అనే నినాదంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ట్రంప్ మాట్లాడుతూ... ధరల తగ్గింపుపై కొత్త హామీలు ఇవ్వకుండా తన హయాంలో పెట్రోల్ ధరలు తగ్గాయని, ట్రిలియన్ల కొద్దీ పెట్టుబడులు వచ్చాయని, ఉద్యోగాలు సృష్టించామని పాత విషయాలనే మళ్లీ ప్రస్తావించారు. తన ప్రసంగంలో మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌ను, డెమొక్రాట్లను తీవ్రంగా విమర్శించారు. అయితే, కొన్ని రోజుల క్రితం 'అఫర్డబిలిటీ' (అందుబాటు ధరలు) అనేది డెమొక్రాట్ల కుంభకోణం అని వ్యాఖ్యానించిన ట్రంప్, ఇప్పుడు 'అమెరికాను మళ్లీ చౌకగా మారుద్దాం' అని నినదించడం గమనార్హం. వచ్చే ఏడాది ప్రతినిధుల సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీలో ఆందోళన కనిపిస్తోంది. ఇటీవలి కొన్ని ఎన్నికల్లో 'అఫర్డబిలిటీ' నినాదంతో డెమొక్రాట్లు పుంజుకోవడం, పలు సర్వేలలో ట్రంప్ పనితీరుపై వ్యతిరేకత వ్యక్తమవుతుండటం ఈ మార్పుకు కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. హౌస్‌లో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ మాత్రమే ఉండటంతో, ప్రజల ఆర్థిక సమస్యలపై దృష్టి పెట్టకపోతే నష్టం తప్పదని సొంత పార్టీ నేతలే హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ట్రంప్ కొన్ని కొత్త హామీలు ఇచ్చారు. 'టారిఫ్ డివిడెండ్ చెక్' కింద చాలామంది అమెరికన్లకు 2,000 డాలర్లు చెల్లిస్తామని, కొత్తగా పుట్టిన పిల్లల కోసం 1,000 డాలర్లతో 'ట్రంప్ అకౌంట్' ప్రారంభిస్తామని ప్రకటించారు.



# 2030 నాటికి ఇండియా నం.1

**భారత డెవలపర్లపై సత్య నాదెళ్ల ప్రశంసలు**

న్యూఢిల్లీ: ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. రానున్న నాలుగేళ్లలో దేశంలో 17.5 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల తెలిపారు. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి ఇదే కావడం విశేషం. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో సత్య నాదెళ్ల మాట్లాడుతూ... 2030 నాటికి 5.75 కోట్ల మంది డెవలపర్లతో ప్రపంచంలోనే అతిపెద్ద డెవలపర్ కమ్యూనిటీగా భారత్ అవతరించనుందని జోస్యం చెప్పారు. నూతన తరం కృత్రిమ మేధ (ఏఐ) ఆవిష్కరణలలో భారతదేశం నాయకత్వ పాత్ర పోషిస్తోందని ఆయన ప్రశంసించారు. "భారతీయ డెవలపర్లు ఇప్పటికే గిట్‌హబ్, అజూర్, మా కొత్త ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించి అధునాతన ప్రాజెక్టులపై పనిచేస్తున్నారు" అని ఆయన వివరించారు.

## ఒయ్యారి చిత్రం



రెజీనా



# వెంకీ.. ఫ్యామిలీ విత్ క్రైం!

విక్టరీ వెంకటేశ్ అంటే ఫ్యామిలీ ఆడియన్స్‌కు కిక్కే కిక్కు. అందుకే ఫ్యామిలీ ఎంటర్టైన్‌మెంట్ ఇస్తూ, కాస్త క్రైం జోడించాలని ఫిక్స్ అయ్యాడు. తాజాగా, త్రివిక్రమ్‌తో మొదలుపెట్టిన 'ఆదర్శ కుటుంబం' విషయానికి వస్తే, ఇక్కడ కూడా అదే ఫార్ములా కనిపిస్తోంది. టైటిల్ వినడానికి చాలా సాఫ్ట్ గా, పద్ధతిగా అనిపిస్తోంది. కానీ టైటిల్ డిజైన్ లో 'ఏకే 47' అనే ట్యాగ్ లైన్ పెట్టడం, అలాగే లోగోలో రక్తపు చుక్క ఉండటం చూస్తుంటే, ఇది మామూలు ఫ్యామిలీ స్టోరీ కాదని క్లారిటీ వచ్చేసింది. పైకి ఆదర్శవంతమైన కుటుంబంలా కనిపిస్తూనే, లోపల ఏదో పెద్ద క్రైమ్ డీల్ లేదా గొడవల్లో ఆ కుటుంబం చిక్కుకున్నట్లుగా కథ ఉండే ఛాన్స్ ఉంది. మరో క్రేజీ ప్రాజెక్ట్ 'దృశ్యం 3'. తన కుటుంబాన్ని కాపాడుకోవడం కోసం ఒక సామాన్యుడు చేసే క్రైమ్, దాని చుట్టూ తిరిగే కథ అందరికీ తెలిసిందే. ఇప్పుడు మూడో భాగంతో ఆ ఉత్కంఠను మరో స్థాయికి తీసుకెళ్లబోతున్నారు. వెంకటేశ్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు చాలా స్మార్ట్ గా ఉన్నాయి. కేవలం సాఫ్ట్ సినిమాలు చేస్తే మాస్ ఆడియన్స్ దూరమయ్యే ప్రమాదం ఉంది, అలాగని ఓవర్ యాక్షన్ సినిమాలు చేస్తే ఫ్యామిలీస్ కు నచ్చకపోవచ్చు. అందుకే ఈ 'ఫ్యామిలీ విత్ క్రైమ్' అనే పాయింట్ ను పట్టుకున్నారు.



# కియారా ఈజ్ బ్యాక్

పండంటి బిడ్డకు జన్మనిచ్చిన కియారా అద్వానీ.. కొంతకాలంగా సోషల్ మీడియాకి కూడా గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు చాలా రోజుల తర్వాత తల్లి అయిన తొలిసారి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కొన్ని కూల్ ఫోటోలను పంచుకుంది. అందులో ఆరెంజ్ కలర్ డ్రెస్ ధరించిన ఈమె.. ఈ బాడీ కాన్ అవుట్ ఫిట్ తో అందరి హృదయాలను దోచుకుంది. మిర్రర్ ముందు స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలకు క్యాప్షన్ గా..'చివరికి నాకు ఒక రాత్రి ఫ్రీగా దొరికింది. ఈ రాత్రిని నన్ను ఆస్వాదించనివ్వండి' అంటూ క్యాప్షన్ జోడించింది.

## పంచాయతీ ఎలక్షన్స్‌లో
# అల్లు అర్జున్ ప్రచారం!?

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సందడి ఉన్న వేళ.. ఓ అభ్యర్థి వినూత్న ప్రచారానికి తెర తీశాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేటకు చెందిన ఓ అభ్యర్థి తన అభిమాన హీరో అల్లు అర్జున్ ఫొటోతో ఏఐ చిత్రాన్ని క్రియేట్ చేసి ప్రచారానికి వెళ్తున్నాడు. ఫొటోలో అల్లు అర్జున్ ఆ అభ్యర్థి తరుఫున ప్రచారం చేస్తున్నట్టుగా కనిపిస్తుండడంతో విషయం తెలియని జనాలు ఆశ్చర్యపోయారు. మంగళవారం నుంచి ఈ చిత్రం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.





# నయనతారతో అనిల్ రావిపూడి పెద్ద ప్లానే..!

అనిల్ రావిపూడి సినిమా అంటే ప్రమోషన్స్ డిఫరెంట్ గా ఉంటాయి. ఈ ప్రమోషన్స్ చూసే సినిమా చూసేయాలి అనే రేంజ్ లో ఆడియన్స్‌ను ఎంగేజ్ చేస్తాడు. మన శంకరవరప్రసాద్ గారు విషయంలోనూ ప్రమోషన్స్‌లో అనిల్ ప్లాన్ నెక్స్ట్ లెవెల్ ఉందట. సినిమా ప్రమోషన్స్ లో చిరంజీవితో పాటు నయనతారని కూడా ఇన్వాల్వ్ చేసే ప్లాన్ ఉందట. నయనతార సినిమాల్లో నటించడమే కానీ కనీసం ఆమె ఏ మూవీ ఈవెంట్ కి అటెండ్ అవ్వదు. కానీ మన శంకర వరప్రసాద్ సినిమా కోసం మాత్రం నయనతారకి ముందే ప్రమోషన్స్ కండీషన్స్ పెట్టిన తర్వాతే ఆమెను తీసుకున్నారట.



# ఎన్నో త్యాగాలు చేశా

బాలీవుడ్ బ్యూటీగా తనకంటూ ఒకప్పుడు స్టార్ స్టేటస్ దక్కించుకున్న ప్రియాంక చోప్రా.. అనూహ్యంగా అవకాశాలు తగ్గడంతో హాలీవుడ్‌కి వెళ్ళిపోయింది. పలు చిత్రాలు, వెబ్ సిరీస్‌లు చేస్తూ గ్లోబల్ స్టార్‌గా పేరు తెచ్చుకుంది. ఈ క్రమంలోనే తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె తాను 20 ఏళ్లుగా ఎన్నో త్యాగాలు చేస్తూ వచ్చాను అని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రియాంక చోప్రా మాట్లాడుతూ..'ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఎలాంటి సినిమాలు ఎంచుకోవాలో నాకు తెలియలేదు. అయితే వచ్చిన ప్రతి ప్రాజెక్టును ఒప్పుకున్నాను. ముఖ్యంగా నాకు అవకాశాలు రావడమే అదృష్టంగా భావించాను. అందుకే పాత్ర ఏదైనా సరే ఓకే చెప్పేసాను. ఇక 20 ఏళ్ల వయసులో ఖాళీ లేకుండా ప్రాజెక్టులు చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం వల్లే ప్రతి పాత్రను అంగీకరించాను. సినీ జీవితంలో ఎంత కష్టపడ్డానో నాకు మాత్రమే తెలుసు. ఎన్నో పుట్టిన రోజులు, పండుగ దినాలు మిస్ అయ్యాయి. ఆఖరికి నా తండ్రి హాస్పిటల్‌లో ఉంటే ఆయన చివరి రోజుల్లో కూడా దగ్గరుండి చూసుకోలేకపోయాను. నా కుటుంబంతో గడిపిన సందర్భాలు కూడా లేవు. ఆ సమయంలో అన్ని కష్టాలు పడ్డాను కాబట్టే నేడు ఈ స్థాయిలో ఉన్నాను. 20 ఏళ్లు త్యాగం చేసి నేడు ఈ స్థాయికి చేరుకున్నాను.

# బాలయ్య ఇంట్లో భారీ హోమం

అడ్డంకులన్నీ దాటుకుని 'అఖండ 2' ఎట్టకేలకు డిసెంబర్ 12న థియేటర్లలోకి దిగుతోంది. అయితే బాక్సాఫీస్ దగ్గర యుద్ధం చేయడానికి ముందు తన జూబ్లీహిల్స్ నివాసంలో ఒక భారీ హోమాన్ని నిర్వహిస్తున్నారట. సినిమా విడుదలకు ముందు ఇలాంటి శాంతి పూజలు చేయడం మంచిదని పండితులు సూచించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా గత వారం రోజులుగా సినిమా విడుదలకు సంబంధించి జరిగిన ఆర్థిక, న్యాయపరమైన గొడవలు ఒకరకమైన నెగిటివ్ వైబ్స్ ను క్రియేట్ చేశాయి. ఆ దోషాలన్నీ తొలగిపోవాలనే ఉద్దేశంతోనే ఈ హోమం జరిపిస్తున్నట్లు సమాచారం. 'అఖండ' సినిమా కూడా శివుడి ఇతివృత్తంతో, సనాతన ధర్మం నేపథ్యంలో నడుస్తుంది. కాబట్టి దానికి తగినట్లుగానే రుద్ర హోమం లేదా చండీ హోమం వంటివి నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. సినిమా పాజిటివ్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా, కమర్షియల్ గా కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగిపోవాలని సంకల్పం తీసుకున్నారట.






## గంభీర్ తప్పు చేస్తున్నాడు

భారత క్రికెట్ జట్టులో వెటరన్ ఆటగాళ్ల కొనసాగింపుపై చర్చ జరుగుతున్న సమయంలో పాక్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌లలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల అద్భుత ప్రదర్శన తర్వాత షాహిద్ అఫ్రిది వారిని 2027 ప్రపంచ కప్ వరకు జట్టులో కొనసాగించాలని గట్టిగా వాదించారు. టీమిండియా ఈ ఇద్దరు దిగ్గజాలను తెలివిగా ఉపయోగించుకోవాలని సూచించారు. బలహీన జట్లతో ఆడేటప్పుడు వారికి విశ్రాంతి ఇచ్చి కీలక సిరీస్‌లలో వారిని ఆడించాలని చెప్పారు. 'గౌతమ్ తన పదవీకాలాన్ని ప్రారంభించిన తీరు చూస్తే, తాను అనుకున్నది, తాను చెప్పింది మాత్రమే సరైనదని అతను భావించినట్లు అనిపించింది. కానీ కొంతకాలం తర్వాత, మీరు ఎల్లప్పుడూ సరైనవారు కారని నిరూపించబడింది' అని విమర్శలు గుప్పించారు.




## అతడు సిక్సర్ల రారాజు: సౌతాఫ్రికా కోచ్

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపై సౌతాఫ్రికా బ్యాటింగ్ కోచ్ ఆష్వెల్ ప్రిన్స్ ప్రశంసల జల్లు కురిపించాడు. హార్దిక్ పాండ్యా సిక్సర్ల రారాజు అని, ఏ బంతిని ఆడాలనే విషయంలో మంచి అనుభవం ఉందని కొనియాడాడు. 'హార్దిక్ పాండ్యా సిక్సర్ల రారాజు. అతను సిక్సర్లు కొట్టడమే కాదు. ఏ బంతిని కొట్టాలో.. ఏ బంతిని వదిలేయాలో కచ్చితంగా అంచనా వేయగల సామర్థ్యం, పరిణితి అతనికి ఉంది. ఇది సుదీర్ఘ అనుభవంతో మాత్రమే వస్తుంది. బంతి అతని యార్క్‌లో పడితే ఎలాంటి సంకోచం లేకుండా బౌండరీకి తరలిస్తాడు. చాలా క్లారిటీతో బ్యాటింగ్ చేస్తాడు. అతని ఇన్నింగ్స్ అద్భుతంగా ఉంది. ముఖ్యంగా అతను షాట్ ఆడే విధానం అద్భుతంగా ఉంటుంది' అని ఆష్వెల్ ప్రిన్స్ తెలిపాడు.

## హెడ్ కోచ్‌పై క్రికెటర్ల దాడి

పాండిచ్చేరి క్రికెట్ అసోసియేషన్(సీఏపీ) అండర్ 19 హెడ్ కోచ్ ఎస్ వెంకటరామన్‌పై ముగ్గురు సీనియర్ క్రికెటర్లు దాడి చేశారు. జట్టు ఎంపికలో తమకు అన్యాయం చేశారనే భావనతో ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. సోమవారం జరిగిన ఈ ఘటనలో కోచ్ వెంకటరామన్ తలకు గాయం కాగా.. భుజం విరిగిందని సేదరపేట పోలీసులు తెలిపారు. వెంకటరామన్ నుదిటిపై 20 కుట్లు పడ్డాయని, ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి స్థానిక ఆటగాళ్లను ఎంపిక చేయలేదనే కోపంతో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. దాడి ఘటనపై బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితులను కఠినంగా శిక్షిస్తామని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా మీడియాకు తెలిపారు.

## క్రికెట్ కంటే ఇంకేం ఇష్టం లేదు : స్మృతి మంధాన

పలాష్ ముచ్చల్‌తో పెళ్లి రద్దు చేసుకున్న తర్వాత టీమిండియా వుమెన్స్ జట్టు వైస్ కెప్టెన్ తొలిసారిగా బయట కనిపించింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్‌తో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. మందిరా బేడితో జరిగిన టాక్ షోలో స్మృతి పాల్గొన్నది. ఈ సందర్భంగా మంధాన మాట్లాడుతూ క్రికెట్ ఆడం తప్ప తనకు ఇంకేది ఇష్టం లేదని వెల్లడించింది. భారత జట్టు జెర్సీని వేసుకోవడం వల్ల అది తన బాధలన్నీ తొలగిపోతాయని.. ఎందుకంటే అది తన బాధ్యతను ఇస్తుందని చెప్పుకొచ్చింది. 'భారత జెర్సీ ధరించడం నాకు స్ఫూర్తినిస్తుంది. నా చింతలన్నింటినీ తొలగిస్తుంది. జెర్సీ ధరించిన తర్వాత మీపై బాధ్యతలు ఉన్నందున మీకున్న సమస్యలన్నింటినీ పక్కన పెట్టాలని నేను ఎప్పుడూ అందరికీ చెబుతాను. మీరు లక్షలాది మందికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. మీరు మంచి ప్రదర్శన ఇవ్వడంపై దృష్టి పెడితే సరిపోతుంది' అని తెలిపింది.




# ఆ నలుగురికి నిరాశే!

**నేడే రెండో టీ20 మ్యాచ్**






**భారత టీ20 టీమ్**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ,సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తీ, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.

సౌతాఫ్రికాతో తొలి టీ20లో దూకుడు మీద ఉన్న టీమిండియా.. రెండో టీ20 కోసం రెడీ అవుతోంది. న్యూ చండీగఢ్ వేదికగా గురువారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. కటక్ వేదికగా జరిగిన తొలి టీ20లో టీమిండియా పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తా చాటి 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో టీ20లోనూ అదే జోరును కొనసాగించాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు చెత్త బ్యాటింగ్‌తో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న సౌతాఫ్రికా.. రెండో టీ20లోనైనా గట్టి పోటీనివ్వాలనే పట్టుదలతో ఉంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలి టీ20 విజయంతో టీమిండియా కాంబినేషన్‌లో మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బ్యాట్ ఝులిపించాల్సి ఉంది. గాయం నుంచి కోలుకొని బరిలోకి దిగిన శుభ్‌మన్ గిల్ తీవ్రంగా నిరాశపర్చాడు. వన్డే, టెస్ట్‌ల్లో సత్తా చాటుతున్న గిల్.. టీ20ల్లో మాత్రం ఆశించిన రీతిలో రాణించలేకపోతున్నాడు. తొలి మ్యాచ్‌లో 4 పరుగులే చేసి వెనుదిరిగాడు. రెండో టీ20లోనైనా అతను సత్తా చాటాలి. లేదంటే అతనిపై విమర్శలు ఎక్కువవుతాయి. ఫస్ట్ డౌన్‌లో ఆడిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తీవ్రంగా నిరాశపర్చాడు. ఈ ఏడాది సూర్య ఒక్క మ్యాచ్‌లో కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. గత 15 ఇన్నింగ్స్‌ల్లో ఒక్క హాఫ్ సెంచరీ లేదు. రెండో టీ20లోనైనా సూర్య సత్తా చాటాలి. తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబేలు కూడా బ్యాట్ ఝులిపించాల్సి ఉంది. తొలి టీ20లో హార్దిక్ పాండ్యా మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. అతను అదే జోరు కొనసాగించాల్సి ఉంది. చివర్లో తనదైన శైలిలో ఫినిష్ ఇచ్చేందుకు జితేష్ సిద్దంగా ఉన్నాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తీకి తిరుగులేదు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లు కూడా సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలోనే తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం కనిపించడం లేదు. దాంతో హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లకు మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.

## వన్డే ర్యాంకింగ్స్‌లో విరాట్ నం.2

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆధిపత్యం కొనసాగించారు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ రెండో స్థానానికి చేరుకున్నారు. ఇప్పటికే నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతున్న రోహిత్ శర్మ.. తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. దాంతో రన్ మిషన్ ర్యాంకు గణనీయంగా మెరుగుపడింది. ప్రస్తుతం నెంబర్ వన్ ప్లేస్‌ను చేరుకునేందుకు విరాట్ కోహ్లీ.. అగ్రస్థానానికి చేరుకునేందుకు కేవలం ఎనిమిది రేటింగ్ పాయింట్ల దూరంలో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచుల్లో 302 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నది. సిరీస్‌లోని చివరి వన్డేలో కోహ్లీ అజేయంగా 65 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దాంతో ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో రెండుస్థానాలు మెరుగుపరుచుకొని రెండో ప్లేస్‌కు చేరుకున్నాడు. బౌలింగ్ ర్యాంకుల్లో కుల్దీప్ యాదవ్ మూడు ర్యాంకులు మెరుగుపరుచుకొని మూడోస్థానంలో నిలిచాడు. టెస్ట్ ర్యాంకుల్లో టీమిండియా బ్యాట్స్‌మెన్ యశస్వీ జైస్వాల్ మాత్రమే ఎనిమిది స్థానంలో నిలువగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 11వ స్థానం, రిషబ్ పంత్ 13వ స్థానాలకు చేరుకున్నారు. టెస్ట్ బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా నెంబర్ వన్ ప్లేస్‌ని నిలబెట్టుకున్నాడు. ఆ తర్వాత మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ ఒక్కో స్థానాన్ని మెరుగుపరుచుకొని వరుసగా 12వ, 13వ, 14వ స్థానాల్లో నిలిచారు.





## మహికాశర్మ వల్లే ఇదంతా: హార్దిక్ పాండ్యా



తన ప్రియురాలు మహికా శర్మ వల్లే సౌతాఫ్రికాతో తొలి టీ20లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చానని టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తెలిపాడు. సానుకూల దృక్పథమే తనను తిరిగి మైదానంలో అడుగు పెట్టేలా చేసిందని తెలిపాడు. 'గాయం తర్వాత నేను మరింత దృఢంగా తిరిగి వచ్చాను. గాయాలు మనల్ని మానసికంగా పరీక్షిస్తాయి. బలంగా నిలబడటం వల్లే నాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. నా మీద నాకు చాలా నమ్మకం ఉంది. నిజానికి మనల్ని మనం కచ్చితంగా నమ్మాలి. మనమీద మనకే విశ్వాసం లేనప్పుడు ఇతరులు మనల్ని ఎలా నమ్ముతారు. మైదానంలో దిగిన ప్రతీ క్షణాన్ని, ఆటను ఆస్వాదించాలనుకున్నా. జనాలను ఆకట్టుకునేలా ఆడాలనుకోవడమే నాకు అసలైన ప్రేరణ. అలాగే నేను రాణించడానికి నా ప్రియురాలు కూడా ఓ కారణం. ఆమె నా జీవితంలోకి వచ్చిన తర్వాత చాలా మంచి జరిగింది' అని హార్దిక్ పాండ్యా తన ప్రియురాలు మహికా శర్మ గురించి చెప్పుకొచ్చాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
గురువారం 11-12-2025 | www.evarthalu.com




## ఒక్కో ఓటు - పల్లె భవిష్యత్తు

భారతీయ ప్రజాస్వామ్యానికి పల్లెలే పట్టుకొమ్మలు. గ్రామాలు బలపడితేనే దేశం బలపడుతుంది, దేశాభివృద్ధికి గ్రామ స్వపరిపాలన అత్యంత కీలకం. ఈ గ్రామ పాలనలో సర్పంచులు, వార్డు సభ్యులను ఎన్నుకునే పంచాయతీ ఎన్నికల్లో ఒక్కో ఓటు ఎంతో విలువైనది, అది పల్లె భవిష్యత్తును నిర్దేశిస్తుంది. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో వేల ఓట్ల మెజారిటీలు సర్వసాధారణం. కానీ, పల్లె పోరులో ఒక్క ఓటుతోనే అభ్యర్థుల తలరాతలు, తద్వారా గ్రామాల భవితవ్యం తారుమారు అవుతాయి. గత గ్రామ పంచాయతీ ఎన్నికలు దీనికి ఎన్నో ఉదాహరణలు చూపాయి. కేవలం ఒక్క ఓటు తేడాతో సర్పంచి పీఠాన్ని దక్కించుకున్నవారు ఉన్నారు, అదే ఒక్క ఓటుతో ఓడిపోయి నిరాశ చెందేవారూ ఉన్నారు. సమాన ఓట్లు వచ్చినప్పుడు 'లక్కీ డ్రా' ద్వారా విజేతను నిర్ణయించిన సందర్భాలూ ఉన్నాయి. ఇవన్నీ 'నా ఒక్క ఓటే కదా, వేసినా వేయకున్నా తేడా ఏముంది' అనే నిర్లక్ష్యపు మాట ఎంత ప్రమాదకరమో, ఆ ఒక్క ఓటుకున్న శక్తిని కళ్ళకు కడతాయి. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం కేవలం హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. మద్యం, డబ్బు వంటి ప్రలోభాలకు లోనుకాకుండా, గ్రామాభివృద్ధికి పాటుపడే, సమస్యలను పరిష్కరించగలిగే సమర్థులను ఎన్నుకోవాలి. యువత కూడా కొత్త ఆలోచనలతో ఎన్నికల బరిలో నిలిచి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. అభ్యర్థులు ఇచ్చే హామీలను, వారి గత చరిత్రను బేరీజు వేసుకొని, నిజాయితీపరులను ఎన్నుకునే విజ్ఞత ఓటర్లకు ఉండాలి. కాబట్టి, ప్రతి పౌరుడు తమ ఓటు విలువను గుర్తించి, తప్పనిసరిగా ఓటు వేసి, తమ పల్లె భవిష్యత్తును బంగారుమయం చేసే నాయకులకు పట్టం కట్టాలి. మీ ఒక్క ఓటు, ఐదేళ్ల పాటు మీ గ్రామ ప్రగతికి మార్గదర్శకం అవుతుంది.

– ఈవార్తలు సంపాదకీయం

దేశ అంతర్గత భద్రత అత్యంత క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. 2025 నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన భయంకరమైన కారు పేలుడు ఉదంతం దేశ రాజధానినే కాకుండా, మొత్తం దేశ ప్రజల మనసుల్లో తీవ్ర భయాందోళనలను, భద్రతపై అనుమానాలను కలిగించింది. ఈ ఘటన, మనతోనే కలిసి జీవిస్తూ, మన అభివృద్ధిని, మన శాంతిని కోరుకోని, మన చావును కోరుకునే శక్తులు దేశంలోనే పాతుకుపోతున్నాయా అనే తీవ్రాలోచనకు తావిస్తోంది. ఇది కేవలం బాహ్య సరిహద్దుల నుండి వచ్చే ముప్పు మాత్రమే కాదు, దేశం లోపల నుండే తలెత్తుతున్న ఒక పెను ప్రమాదం. అంతర్గత భద్రత అనేది దేశ సుస్థిరతకు, అభివృద్ధికి అత్యంత కీలకమైన అంశం.

## అంతర్గత భద్రత.. అప్రమత్తం!



ఉగ్రవాదం, వేర్పాటువాదం, అంతర్యుద్ధాలు వంటి అనేక సవాళ్లు దేశ అంతర్గత భద్రతకు ముప్పుగా పరిణమిస్తాయి. ఈ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రభుత్వం, భద్రతా దళాలు, నిఘా సంస్థలు మరియు పౌరులు అందరూ సమన్వయంతో పనిచేయాలి. సరిహద్దుల నుంచి, దేశంలోపల నుండి తలెత్తుతున్న ఉగ్రవాదం దేశ భద్రతకు తీవ్రమైన ముప్పు. ఉగ్రవాద సంస్థలు హింసను ప్రేరేపించి, ప్రజలలో భయాందోళనలు సృష్టించి, దేశ సుస్థిరతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. కొన్ని వర్గాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తాయి. ఇది దేశ సమగ్రతకు, ఐక్యతకు ముప్పు కలిగిస్తున్నాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాల వల్ల అంతర్యుద్ధాలు, సామాజిక అశాంతి తలెత్తే ప్రమాదం ఉంది. ఇది దేశంలో అస్థిరతను సృష్టించి, అభివృద్ధిని అడ్డుకుంటుంది. డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు, సైబర్ దాడులు పెరిగిపోయాయి. ఇవి దేశ ఆర్థిక వ్యవస్థకు, కీలక మౌలిక సదుపాయాలకు తీవ్రమైన నష్టం కలిగిస్తున్నాయి. మాదకద్రవ్యాల స్మగ్లింగ్, మానవ అక్రమ రవాణా, ఆయుధాల అక్రమ రవాణా వంటి సంఘటిత నేరాలు దేశ భద్రతకు పరోక్షంగా ముప్పు కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. భద్రతా దళాలకు ఆధునిక శిక్షణ, ఆయుధాలు మరియు సాంకేతిక పరిజ్ఞానం అందించడం ద్వారా వారి సామర్థ్యాన్ని పెంచాలి. ఉగ్రవాద కార్యకలాపాలను ముందే పసిగట్టి, వాటిని నిరోధించడానికి నిఘా వ్యవస్థను మరింత సమర్థవంతంగా చేయాలి. కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థల మధ్య సమన్వయం మరియు సమాచార మార్పిడిని పెంచాలి. ఉగ్రవాదం, వేర్పాటువాదం, సంఘటిత నేరాలను అరికట్టడానికి కఠినమైన చట్టాలు రూపొందించి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. ప్రజలను భద్రతా అంశాల పట్ల చైతన్యపరచాలి. అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి, అధికారులకు సమాచారం అందించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరం. పేదరికం, నిరుద్యోగం, అసమానతలు వంటి సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించడం ద్వారా అసంతృప్తిని తగ్గించి, ఉగ్రవాదం, వేర్పాటువాదం వైపు యువత ఆకర్షించబడకుండా నిరోధించవచ్చు. సైబర్ దాడుల నుండి దేశ కీలక మౌలిక సదుపాయాలను రక్షించడానికి సైబర్ భద్రతను పటిష్టం చేయాలి. అంతర్గత భద్రత అనేది ఒక నిరంతర ప్రక్రియ. దేశ భద్రతను కాపాడటానికి ప్రభుత్వం, భద్రతా సంస్థలు, పౌరులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. సమన్వయంతో పనిచేయాలి. దేశ సమగ్రతను, సుస్థిరతను కాపాడటానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. ఇందుకోసం ప్రతి భారతీయుడు చొరవ తీసుకోవాలి.

– సుధాకర్ సిరోంచ, ప్రభుత్వ టీచర్



## పిల్లల భవితకు బాటలేద్దాం

ప్రపంచవ్యాప్తంగా ప్రతి బిడ్డకు మెరుగైన భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యూనిసెఫ్) అవిశ్రాంతంగా పనిచేస్తోంది. దీని లక్ష్యాలు పిల్లల హక్కులను పరిరక్షించడం, వారి ప్రాథమిక అవసరాలను తీర్చడం, వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించేలా ప్రోత్సహించడం. ఈ లక్ష్యాలను నెరవేర్చే క్రమంలో, మనం ప్రతి ఒక్కరం భాగస్వాములై, పిల్లల భవితకు బలమైన బాటలు వేయాల్సిన బాధ్యత ఉంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, యుద్ధంతో నాశనమైన దేశాలలోని పిల్లలు, తల్లులకు అత్యవసర ఆహారం, ఆరోగ్య సంరక్షణ అందించాలనే తక్షణ అవసరం ఏర్పడింది.



అభిషేక్ కురుమ

ఈ నేపథ్యంలో, 1946 డిసెంబర్ 11న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ద్వారా యూనిసెఫ్ స్థాపించబడింది. ప్రారంభంలో ఇది ఒక తాత్కాలిక నిధిగా సృష్టించబడినప్పటికీ, 1950ల తర్వాత ఇది తక్కువ అభివృద్ధి చెందిన దేశాలలో పిల్లల సంక్షేమాన్ని మెరుగుపరచడానికి సాధారణ కార్యక్రమాల వైపు తన దృష్టిని మళ్లించింది. 1953లో, ఇది ఐక్యరాజ్యసమితి శాశ్వత సంస్థగా మారింది, 'అత్యవసర' అనే పదం దాని పేరు నుంచి తొలగించారు. అయినప్పటికీ సంక్షిప్త నామం యూనిసెఫ్ అలాగే కొనసాగింది. 1990 నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాల రేటును 60 శాతం కంటే ఎక్కువ తగ్గించడంలో ప్రపంచ పురోగతికి యూనిసెఫ్ 'పిల్లల మనుగడ విప్లవం' పునాదిగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు అందించడంలో యూనిసెఫ్ కీలక పాత్ర పోషించింది, ఇది అనేక ప్రాణాంతక వ్యాధులను నియంత్రించడానికి సహాయపడింది. 1965లో, దేశాల మధ్య సోదరభావాన్ని పెంపొందించడం, ప్రపంచ శాంతికి ఒక ముఖ్యమైన కారకంగా ఉద్భవించినందుకు యూనిసెఫ్‌కు నోబెల్ శాంతి బహుమతి లభించింది. పిల్లలకు ప్రాథమిక విద్య, పోషకాహారం, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్య సేవలను అందించడానికి, ప్రోత్సహించడానికి ఇది నిరంతరం కృషి చేస్తుంది. యూనిసెఫ్ తన పనితీరులో కొన్ని సవాళ్లను, విమర్శలను కూడా ఎదుర్కొంది. వివిధ దేశ ప్రభుత్వాలు, ప్రైవేట్ దాతల విరాళాలపై ఆధారపడటం వల్ల కొన్నిసార్లు నిధుల స్థిరత్వానికి సవాలుగా మారుతోంది. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలలో లోపాలు, నిరంతర మానవతా సంక్షోభాలు, కొవిడ్ మహమ్మారి ప్రభావాలు, వాతావరణ మార్పుల వంటి బాహ్య సవాళ్లను సంస్థ ఎదుర్కొంది. సంస్థ అంతర్గత ఒత్తిళ్లను కూడా ఎదుర్కొంటోంది. చివరగా.. యూనిసెఫ్ నిర్దేశించిన లక్ష్యాలు కేవలం ఒక అంతర్జాతీయ సంస్థకు మాత్రమే పరిమితం కావు. అవి మన సమాజ ప్రగతికి, మానవత్వపు విలువలకు అద్దం పడతాయి. ప్రతి బిడ్డ చిరునవ్వుతో, ఆరోగ్యంగా, చదువుకుంటూ, సురక్షితంగా పెరిగినప్పుడే నిజమైన దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. కాబట్టి, ప్రతి ఒక్కరం మన వంతు బాధ్యతగా యూనిసెఫ్ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్తూ, రేపటి పౌరులైన పిల్లల భవితకు దృఢమైన పునాదులు వేద్దాం.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.